ప్రజాశక్తి

మంగళవారం 14 ఫిబ్రవరి 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా

ఆస్పత్రి వద్ద బాలిక తల్లిని పరామర్శిస్తున్న ఐద్వా నేతలు రమాదేవి, శ్రీనివాసకుమారి, గిరిజ తదితరులు; తెలుగు మహిళా నాయకురాలు కళ్యాణి తదితరులు

జిజిహెచ్ వద్ద ఉద్రిక్తత

హత్యకు గురైన బాలికను ఆదుకోవాలని ఐద్వా, తెలుగు మహిళల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తాడేపల్లిలో గంజాయి మత్తులో ఓ వ్యక్తి హత్య చేసిన బాలిక చూసేందుకు, మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు సోమవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వచ్చిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మను తెలుగు మహిళలు అడ్డుకున్నారు. దీంతో ఆస్పత్రి వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్దకు వచ్చిన వాసిరెడ్డి పద్మ మృతురాలి తల్లి, పెద్దమ్మను పరామర్శించి వివరాలను అడిగితెలుసుకుంటున్న సమయంలో అక్కడికి వచ్చిన తెలుగు మహిళలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో మార్చురీ వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. మార్చురీ నుండి బయటకు వచ్చిన వాసిరెడ్డి పద్మ కారుకు అడ్డంగా తెలుగు మహిళలు బైఠాయించారు. వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి తెలుగు మహిళలను పక్కకు నెట్టేశారు. దీంతో ఆమె ఆస్పత్రి నుండి బటయకు వచ్చారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఐద్వా, తెలుగు మహిళల నిరసన

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, తెలుగు మహిళా సంఘాల ఆధ్వర్యాన సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆసుపత్రి ఆవరణలో నిరసనకు దిగారు. ఈ ఆందోళనల్లో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, సహాయ కార్యదర్శి దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, పట్టణ అధ్యక్షులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, కార్యదర్శి పి.గిరిజ, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి, పట్టణ అధ్యక్షురాలు కుసుమ కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ హత్యచేసిన రాజు తరచుగా గంజాయి సేవించి మహిళలను వేధిస్తున్నాడని, గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, చర్యలు తీసుకుని ఉంటే ఇటువంటి

బాలిక తల్లిని పరామర్శిస్తున్న వాసిరెడ్డి పద్మ

(మిగతా 6లో)

గుప్త నిధి తవ్వకాలకు ముఠా యత్నం

అర్ధరాత్రి సమయంలో పట్టుకున్న రైతులు ● దేహశుద్ధి చేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి -తిరువూరు : గుప్త నిధుల కోసం అర్ధరాత్రి సమయంలో వచ్చిన ముఠాకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన తిరువూరు పరిసర ప్రాంతాల్లో సంచలనం కలిగించింది. సేకరించిన వివరాల ప్రకారం...తిరువూరు మండలం చౌటపల్లి, శివారు గ్రామం టేకుల పల్లి గ్రామాల మధ్యలో ఉన్న చెరువు అలుగు వద్ద ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో కారు ఆగింది. దీనిలో నుండి నలుగురు వ్యక్తులు దిగి పక్కనే పొలంలోకి వెళ్లారు. అదే సమయంలో పంట పొలాలకు నీళ్ల పెట్టి వస్తున్న కొంతమంది యువ రైతులు కారులో ఉన్న మరో నలుగురిని అర్ధరాత్రి సమయంలో ఇక్కడకెందుకొచ్చారని ప్రశ్నించారు. కారు ఆగిపోయిందని, కదలడంలేదని సమాధానం చెప్పారు. ఈలోగా పొలంలోకి వెళ్లిన నలుగురు వ్యక్తులు ఈ రైతులను చూసి పరారయ్యారు. అనుమానం వచ్చిన రైతులు కారులో చిన్న బాలుడు, మారణాయుధాలు ఉండటాన్ని గమనించి చౌటపల్లి గ్రామంలోని కొంతమందికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చారు. 10 నిమిషాల్లో గ్రామస్తులు అక్కడికెళ్లి కారులో ఉన్న వారికి దేహశుద్ధి చేశారు. పొలంలో గుప్త నిధులున్నాయని చెప్పారు. కారులో బాలుడు కూడా ఉండడంతో నరబలి ఇచ్చేందుకు వారు వచ్చి ఉంటారని గ్రామస్తులు భావించారు. దీంతో వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుప్త నిధులకోసం బాలుడి తీసుకుని ఏడుగురు వచ్చారని, వీరిలో బాలుడు తండ్రి కూడా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఏడుగురిలో ఇద్దరు తిరువూరు మండలం ఎరుకోపాడు, ఒకరు గానుగపాడు గ్రామానికి, మరొకరు తిరువూరుకు, మిగిలిన ముగ్గురు తెలంగాణా రాష్ట్ర ఖమ్మంజిల్లా సత్తుపల్లి ప్రాంతానికి చెందిన వారని చెప్పారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారు గుప్త నిధుల అన్వేషణ కోసం వచ్చారని, ఎక్కడా తవ్వకాలు కూడా చేపట్టలేదని తెలిపారు. కళ్లకు కాటుకపెట్టుకుని చూస్తే బంగారం కనబడుతున్నట్లు భ్రమలో ఉన్నారే తప్ప నరబలి చేయటానికి బాలుడిని తీసుకురాలేదని అన్నారు. మిగిలిన వివరాలు విచారణలో తెలుస్తాయని వివరించారు.

నిందితులు

గాయపడిన విద్యార్థునులను ఆదుకోవాలి

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు పవన్‌కుమార్
● వర్సిటీ వద్ద విద్యార్థుల నిరసన ● పరీక్షల బహిష్కరణ

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయంలో వసతి గృహం నిర్మాణంలో జాప్యం, వర్సిటీ విద్యార్థులకు వసతి కల్పించడంలో వర్సిటీ విసి నిర్లక్ష్యం కారణంగానే ఇద్దరు విద్యార్థునులు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.పవన్ కుమార్ విమర్శించారు. వర్సిటీ విద్యార్థులకు వసతి గృహాలు లేకపోవడంతో బయట అద్దెకుంటున్న పావని, మెర్సీలత ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఎన్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు. గాయపడిన విద్యార్థునులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, విద్యార్థులకు వెంటనే వర్సిటీలో వసతి సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం వర్సటీలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరీక్షలకు బహిష్కరించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై విసికి తాము అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చినా పరిష్కారం కాలేదన్నారు. గాయపడిన విద్యార్థునుల వైద్య ఖర్చులు వర్శిటీ యాజమాన్యం భరించాలని, బాధితులకు లేదా వారి కుటుంబ సభ్యుల్లో ఒక్కొక్కరికి ఉప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వచ్చే విద్యాసవత్సరం నాటికి విసతి గృహం నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఆర్‌టిసి బస్సులు సరిపోకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల అదనపు బస్సులను, విద్యార్థునులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో తాగునీరు సరిపోవడం లేదన్నారు. పరీక్షలు రాసిన నెల రోజులలోపే ఫలితాలు విడుదల చేయాలని, పరీక్ష ఫీజు, ఆలస్యం ఫీజు, రీవాల్యూషన్ ఫీజులను తగ్గించాలని, విద్యార్థునులకు ప్రత్యేక గదులు, ప్రధమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలని,

(మిగతా 6లో)

పవన్ పరామర్శిస్తున్న సిపిఎం నేతలు రఘు, శర్మ తదితరులు

వర్సిటీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

(ఎస్ఎఫ్ఐ నేతలపై పోలీసుల దాడి వార్త మెయిన్లో)

కళావిహీనంగా

నున్న మామిడి మార్కెట్

కళావిహీనంగా నున్న మ్యాంగో మార్కెట్

● పట్టని మార్కెటింగ్ శాఖ ● ఆసక్తి చూపని రైతులు ● అసాంఘిక చర్యలకు కేంద్రంగా మారిన వైనం

ప్రజాశక్తి -విజయవాడ రూరల్ : ఆసియాలోనే పెద్దదైన 'నున్న' మామిడి మార్కెట్ నిర్వహణ బాధ్యతల నుంచి మార్కెటింగ్ శాఖ పూర్తిగా తప్పుకోవడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నున్న మామిడి మార్కెట్తో ప్రభుత్వానికి రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. టిడిపి హయాంలోనే మంత్రులు కోటగిరి విద్యాధరరావు, వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రత్యేక చొరవతో కోట్ల రూపాయలతో మామిడి మార్కెట్లో పలు అభివద్ధి పనులు చేపట్టారు. గతంలో మామిడి మార్కెట్ విజయవాడలోని కేదారేశ్వరపేటలో ఉండేది. ఇరవై ఏళ్ల క్రితం నున్నకు తరలి వచ్చింది. అందులో భాగంగానే మ్యాంగో గ్రేయర్స్ అసోసియేషన్ వారు నున్న రైతుల నుంచి 23 ఎకరాల భూమిని కొనుగోలు చేసి అభివద్ధి చేశారు. హైదరాబాద్లోని గడ్డి అన్నారం మార్కెట్ తర్వాత నున్న కేంద్రంగా మామిడి వ్యాపారం ఎక్కువగా జరుగుతోంది. ఈ మార్కెట్లో భవనాలను నిర్మించుకున్నారు. ఇక్కడికి ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌ల నుంచి సేట్లు వచ్చి మామిడిని కొనుగోలు చేస్తారు. అయితే నియోజకవర్గాల పునర్విభజనతో విజయవాడ రూరల్ మండలం రెండు ముక్కలైంది. గొల్లపూడి తదితర గ్రామాలు మైలవరం అసెంబ్లీ నియోజకవర్గంలోకి, నున్నతోపాటు మరో ఎనిమిది గ్రామాలు గన్నవరం నియోజకవర్గంలోకి వెళ్లాయి. దీంతో నున్న మ్యాంగో మార్కెట్ ప్రస్తుతం కృష్ణాజిల్లా గన్నవరం ఎఎంసి పరిధిలో ఉంది. నైసర్గికంగా రూరల్ మండలం ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలు వేరైనా నున్న మార్కెట్‌పై ఎన్టీఆర్ జిల్లా ఉన్నాతాధికారులు దష్టి పెట్టాలని మామిడి రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఇతర వ్యాపారాలకు కేంద్రంగా

మామిడి లావాదేవీల సీజన్లో మూడు నెలలే వ్యాపారం ఉంటున్నందున తమ షాపులను వ్యాపారులు ఇతరులకు అద్దెకిచ్చారు. దీంతో కార్గో వ్యాపార లావాదేవీలతోపాటు కోల్డ్ స్టోరేజ్‌లు, బొమ్మల తయారీ కేంద్రాలు తదితర వ్యాపారాలకు మార్కెట్ కేంద్రంగా మారింది. మరోవైపు గొల్లపూడి మార్కెట్ కమిటీ వారు రైతుల కోసం నిర్మించిన రైతు విశ్రాంత భవనం, వ్యాపారం కోసం నిర్మించిన ప్లాట్‌ఫారాలు, వే బిడ్జిలు నిరూపయోగంగా ఉన్నాయి.

ఆసక్తి చూపని రైతులు

ప్రతి ఏడాది మార్చి మొదటి వారంలోనే వ్యాపార లావాదేవీలు ప్రారంభమవుతాయి. ఇందుకోసం రెండు మూడు నెలల నుంచే మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి సౌకర్యాలను పునరుద్ధరించే పనులు జరిగేవి. రెండేళ్లగా ఎఎంసి, మ్యాంగో గ్రోయర్స్ అసోసియేషన్ వారు పట్టించుకోకపోవడంతో అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే విమర్శలున్నాయి. మార్కెట్లోని వాటర్‌ప్లాంట్, వే బ్రిడ్జి, రైతు విశ్రాంతి మందిరాలు నిరుపయోగంగా మారాయి. మార్కెట్ కేంద్రంగా రాత్రి సమయంలో యువత గంజాయి దమ్ము లాగిస్తుండగా, ఇతరత్రా కార్యక్రమాలు కూడా సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో పోలీసులు, మార్కెటింగ్ శాఖ అధికారులు దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతులకు పూర్తిస్థాయిలో సౌకర్యాలు అందుబాటులో లేవు. దీనికితోడు నున్న మార్కెట్లో ధర నిర్ణయంలో అన్యాయం జరుగుతోందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. రెండేళ్లగా ఇతర రాష్ట్రాల వ్యాపారులే నేరుగా రైతుల వద్దకు వెళ్లి మామిడికాయలను కొనుగోలు చేస్తున్నారు. అలాగే మైలవరం, తిరువూరు, విస్సన్నపేట, చంద్రగూడెం, నూజివీడు, ఆగిరిపల్లి, చీమలపాడు తదితర ప్రాంతాల్లో మామిడి మండీలు వెలుస్తున్నాయి. దీనివల్ల రైతులకు రవాణా చార్జీలు ఆదా అవుతున్నాయి. ఈనేపథ్యంలోనే గత ఏడాది సరిగా వ్యాపారం సాగలేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తక్కువ ధర లభిస్తుండడంతో రైతులు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

పేదల భూములు జోలికొస్తే సహించేది లేదు : సిపిఎం

ప్రజాశక్తి-మైలవరం: పేదల భూములు జోలికి వస్తే సహించేది లేదని సిపిఎం నాయకులు హెచ్చరించారు. జి.కొండూరు మండలానికి చెందిన భూస్వాములపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో మైలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మైలవరం మండల నాయకులు సిహెచ్.సుధాకర్ మాట్లాడుతూ మైలవరం గ్రామానికి చెందిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలను మైలవరం, పొందుగల, జి.కొండూరు గ్రామాలకు చెందిన కొందరు చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ974లో ఇందిరాగాంధీ హయాంలో సర్వేనెంబర్ 31 నుండి 321 వరకు 54 మంది లబ్ధిదారులకు 72 ఎకరాల భూమిని అసైన్డ్ చేసి పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. అదే భూమిని బౌండరీ మారిందని నెపంతో అధికారులు పేదలను తప్పుదారి పట్టిస్తూ పెత్తందారులకు, భూస్వాములకు కొమ్ముగాస్తున్నారని ఆరోపించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పేద భూములకు రక్షణ కల్పించి తప్పుడు కేసులు బనాయించి బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ జానీ, బుదేటి యోహాను, సయ్యద్ సదా హుస్సేన్ బేగం, ఏసు, ఒలేటి ఏసు, వందు ఏసు, నూతక్కి శేఖర్ పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయాలి : పద్మజ

చంద్రగుడెంలో వరి పైరును పరిశీలిస్తున్న పద్మజ

ప్రజాశక్తి-మైలవరం

పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదులో ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా నిస్పక్షపాతంగా నమోదు చేయాలని కమిషనరేట్ ఆఫ్ అగ్రికల్చర్ గుంటూరు జాయింట్ డైరెక్టర్ బి.పద్మజ స్థానిక వ్యవసాయాధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె స్థానిక వ్యవసాయాధికారులతో కలిసి మైలవరం మండలం చంద్రగూడెం సమీపంలోని గోగులమూడి సత్యనారాయణ రెడ్డికి చెందిన రబీ వరి పంటను పరిశీలించి ఈ క్రాప్ నమోదుకు సంబంధించి సూపర్ చెక్ నిర్వహించారు. స్థానిక సిబ్బంది గతంలో చేసిన ఈ క్రాప్ నమోదు సక్రమంగా ఉందా, లేదా అని పొలం వద్దనే సిబ్బందితో కలిసి చెక్ చేశారు. పంటల బీమా సక్రమంగా అందాలంటే ఈ క్రాప్ నమోదు నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. సిబ్బంది అప్రమత్తంగా వుంటూ ప్రతి రైతు వేసిన పంటను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆమె రైతు భరోసా కేంద్రాల పనితీరుపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం శ్రీనివాసరావు, వ్యవసాయాధికారిని సంధ్యారాణి, వీఆర్వోలు, ఆర్బీకే సిబ్బందితో పాటు రైతు గోగులమూడి సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్లలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-కంచికచర్ల: వైసిపి పాలనలో ప్రజా సమస్యలు లేవనెత్తిన వారిని అణచివేసేందుకు చూస్తున్నారని నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య విమర్శించారు. ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె స్థానిక ఒకటో వార్డులో ఇంటింటికీ తిరిగి రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకొని టిడిపి కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టాలనుకోవడం వారి అవివేకమన్నారు. గ్రామాలలో, పట్టణాలలో ఇంటి పన్ను, నీటి పన్ను,ఆస్తి పన్ను ఆఖరికి చెత్త మీద కూడా పన్ను వేస్తున్న చెత్త ప్రభుత్వమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, పేరకలపాడు సర్పంచ్ మన్నే సాత్విక్, మాజీ ఎంపిపి అల్లడి కోటేశ్వరరావు, మాజీ ఎంపిటిసి రొంపిచర్ల శ్యాం, నాయకులు వేమా వెంకట్రావు, అన్నదాత రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-సింగ్‌నగర్: వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలను ప్రవేశపెట్టిన సిఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు సోమవారం ఆంధ్రప్రభ కాలనీలో సిఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ ఏ ఒక్క పేదవాడి ఇంట్లో శుభకార్యం ఆగకూడదనే ప్రధాన ఉద్దేశంతో పథకాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. మల్లాది విష్ణు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, మైనార్టీ నాయకులు అక్బర్, అఫ్రోజ్, నజీర్, రఫీ, అన్సారీ బేగ్, ఎస్.కె.బాబు, కరీముల్లా, ఎస్.కె.రఫీ, ఎస్.కె.ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఓ వివాహితను వేధింపులకు గురిచేయడమే గాకుండా కుటుంబ సభ్యులపై హత్యాయత్నంకు పాల్పడిన ఆరుగురు నిందితులపై కేసు నమోదుచేశారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతబస్తీ విద్యాధరపురం ఆదివారం రాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనలో దాడికి పాల్పడిన అదే ప్రాంతానికి చెందిన వడ్డాది నరేష్, వడ్డాది రమణ, బొబ్బిలి పవన్, లోకేష్, భూతి మణి మరియు ఆటో డ్రైవర్ స్వరూప్ రత్నకిరణ్ (పింకి)లపై బాధితురాలు యర్రంశెట్టి భారతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదుచేసి అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మహాలక్ష్మి టెంపుల్ వీధి, విద్యాధరపురంలో యర్రంశెట్టి భారతి, ఏడుకొండలు కుటుంబం నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు. భారతి ప్రైవేటు స్కూల్‌లో ఆయాగా పనిచేస్తుంటుంది, భర్త ఏడుకొండలు విజయవాడ వివిసిలో డ్రైవర్‌గా పనిచేస్తాడు. కుమారులైన విష్ణు, పవన్‌కు వివాహాలు అయ్యాయి. పెద్ద కొడుకు విష్ణు భార్య అయిన నందినిని ఇంటికి దగ్గరలో ఉండే వడ్డాది రమణ, తమ్ముడు వడ్డాది నరేష్ కొన్ని రోజుల నుండి దారిన వస్తూ పోతున్న నందినిని వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు తెలుపగా మామ ఏడుకొండలు వడ్డాది నరేష్ ఇంటికి ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వెళ్లి మా కోడలు నందిని పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నారని మందలించి వచ్చాడు. దాంతో ఇంటికి వచ్చి మాట్లాడతావా అంటూ వడ్డాది నరేష్, రమణ, బొబ్బిలి పవన్, లోకేష్, భూతి మణి మరియు ఆటో డ్రైవర్ పింకి అందూ కలిసి పథకం ప్రకారం ఆదివారం రాత్రి సమయంలో ఏడుకొండలు ఇంటికి దాడికి దిగారు. నీ భర్తను ఇంట్లోకి పంపించావు, మీ అందరినీ చంపే ఇక్కడి నుండి వెళ్లామంటూ ఫిర్యాది అయిన భార్య భారతిని పదునైన చాకుతో దాడికి పాల్పడ్డారు. చేతికి బలమైన గాయమైంది. అలాగే భారతి కుమారుడు నాగరాజుపై కూడా దాడిచేసి గాయపరిచారు.కొడుకు స్నేహితుడైన హేమంత్‌ను, బంధువైన అరుణ్‌కుమార్‌ను కత్తితో దాడిచేయటంతో తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో చుట్టుపక్కల వారు కేకలు వేయటంతో దాడికి పాల్పడిన వడ్డాది నరేష్, రమణ తదితరులు అక్కడి నుండి పారిపోయారు. మాపై హత్యా ప్రయత్నం చేసిన వ్యక్తులపై తగు చర్యలు తీసుకోవాలని సోమవారం టూటౌన్ పోలీసులకు యర్రంశెట్టి భారతి ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

పట్టువస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి దేవస్థానం ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్లకు సోమవారం పట్టువస్త్రాలు సమర్పించారు.

పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దుర్గగుడి ఇఓ

మహాశివరాత్రి ఉత్సవాలు-2023 సందర్భంగా శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామివార్లకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి తరువున సోమవారం ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు శ్రీశైలం దేవస్థానం చేరుకోగా శ్రీశైల దేవస్థాన అధికారులు ఆలయ మర్యాదలతో వీరికి స్వాగతం పలికారు. అనంతరం వీరు శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జునల స్వామివార్లను దర్శనం చేసుకొని పట్టు వస్త్రాలు స్వామివారికి అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కేసరి నాగమణి, కట్టా సత్యయ్య, దేవిశెట్టి బాలకృష్ణ, బచ్చు మాధవికృష్ణ, అనుమోలు ఉదయలక్ష్మి, నిడమానూరి కళ్యాణి, నంబూరి రవి, చింకా శ్రీనివాసరావు, అల్లూరి కృష్ణవేణి, తొట్టడి వేదకుమారి, ఆలయ వైదిక కమిటీ సభ్యులు ఆర్.శ్రీనివాసశాస్త్రి, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎల్. రమాదేవి, వేదపండితులు, అర్చకులు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సహ చట్టం అమలుపై వినతి

ప్రజాశక్తి-విజయవాడ: సమాచార హక్కు చట్టం-2005ను సమర్ధవంతంగా అమలు చేయడానికి జిల్లా కమిటీని ఏర్పాటు చేయాలని స.హ.చట్టం కార్యకర్త, రాష్ట్ర కో-కన్వీనర్ జంపాన శ్రీనివాసగౌడ్ కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావుకు శ్రీనివాస గౌడ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాచార హక్కు చట్టం-2005ను సమర్ధవంతంగా అమలు చేయడానికి జిల్లాలో ఇద్దరు కార్యకర్తలను ఏర్పాటు చేయాలని కోరారు.ఆ చట్టానికి జిల్లా కలెక్టర్ కో ఆర్డినేటర్‌గా, జిల్లా రెవెన్యూ అధికారి నోడల్ ఆఫీసర్‌గా జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని 2013 మార్చి 12న విడుదలయిన జిఓ ఎంఎస్ నెంబర్ 1185 వివరిస్తుందని తెలిపారు. ఇప్పటికయినా జిల్లా సమన్వయ కమిటీ నియామకానికి తగిన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసగౌడ్ కోరారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం పున:ప్రతిష్ట

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని జమ్మిచెట్టు సెంటర్‌లో ఎగుమతి దిగుమతి వర్తక సంఘం వారి ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ పున.ప్రతిష్ట కార్యక్రమం సోమవారం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ తెలుగు జాతి ఔనత్యం కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి మరువలేనిదన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలిపారు. 60 సంవత్సరాలకు పైగా ఉన్న ఈ విగ్రహాన్ని ఆధునికరించి పున:ప్రతిష్ఠించినట్లు చెప్పారు. త్వరలో ఈ వీధిని పొట్టి శ్రీరాములు వీధిగా నామకరణం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ కౌన్సిలర్ నూకల సాంబ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మానేపల్లి నాగబ్రహ్మం, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవానీప్రసాద్, వాణిజ్య విభాగం అధ్యక్షులు చారుగుండ్ల కొండ,

ఎస్టీ విభాగం అధ్యక్షులు బద్ధు నాయక్, కార్మిక విభాగం అధ్యక్షులు గోగుల వెంకయ్య, నాయకులు చోడవరపు జగదీష్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే టిడిపి ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు నెట్టెం శ్రీ రఘురాం, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి శ్రీరాం రాజగోపాల్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఎస్‌సి వర్గీకరణ కోరుతూ నిరసన

గరికపాడు వద్ద...

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఎస్‌సి వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ తలపెట్టిన జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గరికపాడు గ్రామ సమీపంలోని బలుసుపాడు అడ్డరోడ్డు వద్ద, చిలకల్లు గ్రామ సమీపంలోని 65వ జాతీయ రహదారిపై సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విషయం తెలుసుకున్న జగ్గయ్యపేట సిఐ నాగ మురళి, జగ్గయ్యపేట చిల్లకల్లు ఎస్సైలు బి.వి.రామారావు, కే దుర్గాప్రసాద్ ఎంఆర్పిఎస్ నాయకులను అరెస్టు చేసి జగ్గయ్యపేట, చిల్లకల్లు పోలీస్‌స్టేషన్‌లకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వస్తే వంద రోజులలో ఎస్సీ వర్గీకరణ చేసి చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. ఈ కార్యక్రమంలో మంద వెంకటేశ్వరరావు, కూచిపూడి సత్యం, కొల్లూరి బసవ, పల్లెపోగు రాజారావు, మాతంగి దావీదు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం పేరకలపాడు కాలవ కట్ట సమీపంలో రహదారి దిగ్బంధం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ విశ్వనాథం, మహిళా సమాఖ్య నాయకురాలు జ్యోతి,కోటేశ్వరరావు, ఏసుపోగు వాణి, తవిత,కరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండల పరిధిలోని తోటచర్ల గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఎంఆర్‌పిఎస్ నాయకులు సోమవారం ధర్నాకు దిగారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులను అరెస్టు చేసే క్రమంలో పోలీసులపై రాళ్లు రువ్వగా నందిగామ ట్రాఫిక్‌లో పని చేసే తిరుమలరావు తలకు గాయం కావడంతో హుటాహుటిన నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలకు పాల్పడిన వారిపై తగ్గు చర్యలు తీసుకోనున్నట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. బస్సు చక్రాలకు గాలి తీసేయడంతో అందులో ప్రయాణిస్తున్న 50 మందిని మరొక వాహనంలో తరలించారు. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- మహిళా పోలీసును సత్కరించిన ఎస్పి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక పోలీసు కార్యాలయంలో సోమవారం 8వ వార్డు మహిళా పోలీస్ పావనిని జిల్లా ఎస్పీ పి జాషువా ఘనంగా సత్కరించారు. డిజిపి తరపున రూ 2.500 నగదు అవార్డును అందజేశారు. మచిలీపట్నంలో ఇటీవల జరిగిన వరుస దొంగతనాల్లో నేరస్తుడిని పట్టుకోవడంలో ఎస్పి రచించిన వ్యూహం ఫలించింది. ఎస్పీ వ్యూహంతో చోరీ జరిగిన 30 గంటల్లో అంతర్రాష్ట్ర దొంగను జిల్లా పోలీసులు పట్టుకున్నారు. నేరస్తుడు నుండి భారీగా బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 10వ తేదీన నగరంలో నేరస్తుడు ఒకేరోజు మూడు ఇళ్లల్లో భారీ చోరీలు చేసాడు. చోరీల్లో వందల గ్రాముల బంగారాన్ని, పెద్ద మొత్తంలో నగదును అపహరించాడు. నేరాలకు సంబంధించి పోలీసులకు ఎటువంటి ఆధారాలు చిక్కకుండా నేరస్తుడు జాగ్రత్తలు తీసుకున్నాడు. నేరాలకు పాల్పడిన నేరస్థున్ని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బందాలుగా జిల్లా మొత్తం జల్లెడ పట్టేరు. అయితే నేరస్థుడిని పసిగట్టేందుకు జిల్లాలోని వాలంటీర్ల సహకారం తీసుకోవాలంటూ సిబ్బందికి ఎస్పీ జాషువా ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు చోరీలలో అనుమాని

తుడి ఫోటోని వాలంటీర్ల గ్రూపుల్లో పోస్ట్ చేశారు. సదరు వ్యక్తి స్థానిక ఇందిరమ్మకాలనీలో అద్దెకు ఉంటున్నట్లు గుర్తించిన మహిళా పోలీసు పావని సమాచారాన్ని మచిలీపట్నం పోలీసు స్టేషన్ అధికారికి అందించింది. పట్టుబడిన వ్యక్తి బళ్ళారి కి చెందిన అంతర్రాష్ట్ర దొంగగా గుర్తించారు. నేరస్తుడు నగరంలో పలు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేలినట్లు తెలుస్తుంది.

పోలీసుల దౌర్జన్యంపై ఖండన

ప్రజాశక్తి - గుడివాడ : విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని గుడివాడ పట్టణ సిపిఎం కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి , ఐద్వా పట్టణ కార్యదర్శి పి. రజినీలు తీవ్రంగా ఖండించారు. సోమవారం సిపిఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ కష్ణాజిల్లా ఎస్ఎఫ్ఐ మాజీ జనరల్ సెక్రటరీ పి పవన్ కుమార్ కృష్ణా యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై విసితో మాట్లాడడానికి వెళ్లిన సందర్భంలో పోలీసులు అసభ్యంగా మాట్లాడి బట్టలు ఊడదీసి దౌర్జన్యం చేయడాన్ని తప్పు పట్టారు. యూనివర్సిటీ కాంపౌండ్ లో పోలీసులు ఇలాంటి దుశ్చర్యలు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసేలా ప్రవర్తించడం పోలీసులపై విచారణ చేపట్టి చట్టపరమైన

చర్యలు పోలీసు ఉన్నతాధికారులు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న తహసీల్దార్

ప్రజాశక్తి- అవనిగడ్డ : ఈనెల 18వ తేదీన జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పాత ఎడ్ల లంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై తహసీల్దార్ ఎల్‌వి ఎస్ రామకష్ణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎండో మెంట్ అధికారులతో సమీక్షించారు. ఆలయానికి భక్తులు ఎంతమంది వస్తారు, కష్ణా నది వద్ద స్నానాలు సంబంధించిన ఏర్పాట్లు, భక్తులకు అసౌకర్యం కలక్కుండా చేపట్టవలసిన చర్యలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపర్డెంట్ అతావుల్లా ఏఎస్ఐ ఆలయ ఈవో పి సీతారామయ్య పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-ఘంటసాల : సైబర్ నేరాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఘంటసాల ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ గ్రామస్తులకు సూచించారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని చిట్టూర్పు గ్రామంలో చట్టాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగాయి కాబట్టి ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లోన్ యాప్ ల గురించి అవగాహన లేకుంటే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. డ్వాక్రా రుణాల్లో మోసాలు, కాల్ 1930, దిశా యాప్, ట్రాఫిక్ నిబంధనలు, గ్రామాల్లో సిసి కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యత, డయల్ 100 గురించి ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడపాటి వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ చైర్ పర్సన్ పరుచూరి రామకష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్సిటీలో సౌకర్యాలు మెరుగుపర్చాలి : కొల్లు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీలో చదువుతూ ఇటీవల ప్రమాదవశాత్తు కరెంటు షాక్ కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని తక్షణమే ఆదుకోవాలని మాజీ మంత్రి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు.అలాగే యూనివర్శిటీలో సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసన దీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించారు. తెలుగుదేశం పార్టీ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర, నియోజకవర్గ నాయకులు, తెలుగు యువత నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి బుడమేరు వంతెనను ఢీకొని బైక్ వాగులోకి పల్టీలు కొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. ఈ ప్రమాదంలో తండ్రి మృతి చెందగా కూతురు తీవ్రంగా గాయపడింది. గన్నవరం నుండి విజయవాడ వెళుతున్న సగ్గుర్తి వీరాంజనేయులు తన కుమార్తెతో కలిసి విజయవాడ వెళుతుండగా కేసరపల్లి బుడవేరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. బైకు వాగులోకి పల్టీ కొట్టడంతో తీవ్ర గాయాలకు గురైన వీరాంజనేయులు విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లే సమయానికి మరణించాడు. కుమార్తె మానస తీవ్ర గాయాలకు గురవగా ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. మతుడు విజయవాడ పడమట లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గన్నవరం లోని తన బంధువుల ఇంటికి వచ్చి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

చేతి సంచులు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గోడౌన్ నిర్మాణానికి శంఖుస్థాపన

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం వక్కలగడ్డలో పీఏసీఎస్ కు అనుసంధానంగా 500ల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తుల గోదాము నిర్మాణానికి అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావులు సోమవారం శంకుస్థాపన చేశారు. వక్కలగడ్డ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ నిధులు 10శాతం, నాబార్డు నిధులు 90 శాతం కలిపి రూ.40లక్షల అంచనా వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల గోదాము మరియు మల్టీపర్పస్ ఫెసిలిటేషన్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నారు. ఎమ్మెల్యే, చైర్మన్ లు శంఖుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు అనువైన చేతి సంచులు ఆవిష్కరించి రైతులకు పంచిపెట్టారు. సొసైటీ ఛైర్ పర్సన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ సీఈఓ ఏ.శ్యామ్ మనోహర్, బ్యాంక్ డైరెక్టర్ జీ. పెద వెంకయ్య, ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, ఏఎంసీ ఛైర్మన్లు వేమూరి వెంకట్రావు, కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లిలో కోతులు పట్టివేత

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో ప్రజలను ఇబ్బంది పెడుతున్న వానరములను పట్టించేందుకు సర్పంచ్ లక్ష్మీ మౌనిక చర్యలు చేపట్టారు. కోతుల బెడద నియంత్రించాలని కోరుతూ గ్రామ పంచాయితీ తీర్మానం మేరకు సర్పంచ్ లక్ష్మి మౌనిక, గ్రామ సెక్రటరీ మౌనిక లు రంగంలోకి దిగారు. కోతులు పట్టే వ్యక్తులను పిలిపించి సుమారు వంద కోతులను పట్టించి వాటిని అడవిలో వదిలారు. అలాగే కేసరపల్లి పంచాయతీ పరిధిలోని ఏలూరు కాల్వ పక్కనే ఉన్న చెత్త తొలగింపు కార్యక్రమాన్ని డిపిఓ నాగేశ్వర్ నాయక్ పరిశీలించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎం మౌనిక, సర్పంచ్ లక్ష్మీ మౌనిక పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలి : ఎస్పి

ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పి జాషువా

ఫిర్యాదుదారులకు భోజనం అందిస్తున్న ఎస్పి

ప్రజాశక్తి - మచిలీపట్నంఅర్బన్ : సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను తెలుపుకొని, ఆ సమస్య పరిష్కారం కోసం నిరీక్షిస్తూ ఉంటారని, ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ చేసి న్యాయం అందించేలా ప్రతి పోలీసు అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలుమూలల వచ్చే ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సమస్యలకు పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యను తెలుసుకొన్నారు. చట్ట పరిధిలో విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారికి బదిలీ చేస్తూ నిర్దిష్ట సమయంలో పరిష్కారం చూపాలని ఆదేశాలు జారీ చేశారు.

స్పందనలోని ఫిర్యాదులు:

పెనమలూరుకి చెందిన వద్దుడు విశ్వనాథం తన ముగ్గురు సంతానంలోని పెద్ద కుమారుడు కోడలు ఆస్తికోసం వద్ద దంపతులను వేధిస్తున్నారని, భౌతిక దాడికి పాల్పడుతూ చంపేస్తామని బెదిరిస్తున్నారని రక్షణ కల్పించాలని కోరాడు. గుడ్లవల్లేరు నుండి వివాహిత సరిత తనకు వివాహం అయి పది ఏళ్ళు గడుస్తున్నా అదనపు కట్నం కోసం అత్తమామలు తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నారని వాపోయింది. కట్నం తీసుకురాని పక్షంలో తన భర్తకు మరొక వివాహం చేస్తామని బెదిరిస్తున్నారని న్యాయం చేయమని ఫిర్యాదు చేసింది. పెడనలో నివాసముంటున్న శేఖర్ తన ఇంటికి సరిహద్దు దారుడు స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రశ్నిస్తే దుర్భాషలాడుతూ భౌతిక దాడికి పాల్పడుతున్నాడని న్యాయం చేయమని ఎస్పీ ఫిర్యాదు చేశాడు.

స్పందనకు వచ్చే ఫిర్యాదుదారులకు భోజనం ఏర్పాటు

స్పందనకు వివిధ రకాల సమస్యలతో వస్తున్న బాధితులు భోజన సదుపాయాన్ని కలిపించే కార్యక్రమాన్ని సోమవారం జిల్లా ఎస్పీ పి జాషువా ప్రారంభించారు. భోజనం చేసిన తదుపరి ఎక్కడికి వెళ్ళాలి, ఎవరిని కలవాలి అన్న విషయాన్ని స్పందన బందం మార్గదర్శకం చేస్తారని ఎస్పి చెప్పారు.

నాదెండ్ల మనోహర్‌కు సత్కారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: జనసేన పార్టీ సభ్యత్వ నమోదు సందర్భంగా వచ్చిన జనసేన పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను 42వ డివిజన్ భవానీపురంకు చెందిన జనసేన నాయకులు తిరుపతి సురేష్, అనూష కలిసి శాలువతో సత్కరించారు. సభ్యత్వ నమోదులో చురుకుగా పాల్గొంటున్నట్లు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన విజయవాడ నగర అధ్యక్షులు పోతిన వెంకట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగంపై నిర్లక్ష్యం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-నందిగామ: కేంద్ర బడ్జెట్ లో విద్యారంగం పట్ల నిర్లక్ష్యం వహించారని ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు విమర్శించారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మొత్తం బడ్జెట్ ప్రసంగంలో ఒక్కసారి కూడా ప్రభుత్వ విద్య గురించి ప్రస్తావించలేదన్నారు. విద్యా రంగం పట్ల బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కొత్త ఫెలోషిప్‌ల కోసం గత సంవత్సరాల్లో జరిగిన తగ్గింపును భర్తీ చేయడానికి బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విద్యా వ్యతిరేక విధానాల ఫలితంగా విద్యార్థుల సంస్థ తగ్గిపోతుందన్నారు. అలాగే ఎపికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు గురించి చర్చే లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి జి.గోపినాయక్, ఖాజు పాల్గొన్నారు.

అమ్మాజీకి నివాళి

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మాజీ ఉప సర్పంచ్ షేక్ ఖాజా సతీమణి అమ్మాజీ (55) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. అమ్మాజీ మృతదేహాన్ని ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య సందర్శించి నివాళులర్పించారు.

నేడు ఆరోగ్య మేళా

ప్రజాశక్తి-మైలవరం: ఈ నెల 14న మండలంలోని అన్ని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో ఆరోగ్యం మేళా నిర్వహించనున్నట్లు ప్రధాన వైద్యాధికారి ఆర్.నరేష్ ఒక తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా కేన్సర్ వ్యాధి పట్ల ఈ మేళాలో ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు సాధారణ వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. సైకిల్ తొక్కుకో ఆరోగ్యాన్ని కాపాడుకో అనే నినాదంతో సైకిల్ తొక్కడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చి, ఆరోగ్యపరమైన సలహాలు, సూచనలు అందజేయడం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ చిల్డ్రన్ స్కూల్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఓబిహెచ్ఎ ఆధ్వర్యంలో విద్యాధరపురంలోని షాదీఖానాలో ఆదివారం డివిజన్‌లోని పాఠశాలలకు నిర్వహించిన బాలోత్సవంలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా చిట్టినగర్‌లో గల సెయింట్ థామస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 13 అంశాల్లో విజేతలుగా నిలిచారు. ఈ నేపథ్యంలో సోమవారం గెలుపొందిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రాజు డేవిడ్ దొంతులూరి అభినందించారు.

వృత్తి నైపుణ్యాలకు పదును పెట్టాలి

సూర్యనారాయణ సంస్మరణ సభలో పాల్గొన్న చార్టర్డ్ అకౌంటెంట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ప్రముఖ ఛార్టర్డ్ అక్కౌంటెట్ డి.సూర్యనారాయణ స్ఫూర్తితో వృత్తి నైపుణ్యాలకు మరింత పదును పెట్టాలని టీసీఎస్ మాజీ వైస్ ప్రెసిడెంట్ డీ. విజయకుమార్ అన్నారు. డీ సూర్యనారాయణ అండ్ కంపెనీ వ్యవస్థాపకులు, ప్రముఖ ఛార్టర్డ్ అక్కౌంటెంట్ సూర్యనారాయణ సంస్మరణ సభ, శిష్య ప్రశిష్య కలయిక కార్యక్రమాన్ని కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డీ. విజయకుమార్ మాట్లాడుతూ సూర్యనారాయణ శిష్యప్రశిష్యులు సుమారు రెండు వేల మంది ఛార్టర్డ్ అక్కౌంటెంట్లుగా ప్రపంచ వ్యాపితంగా సేవలందిస్తున్నారన్నారు. నేటి తరాన్ని మరింత సమర్థవంతంగా తయారు చేయాలని సూచించారు. సుమారు మూడు దశాబ్దాల తరువాత అందరూ కలిసి తమ గురువును స్మరించుకోవటం ఆనదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఛార్టర్డ్ అక్కౌంటెంట్లు ఎం. కష్ణమూర్తి, కొంకిమళ్ల శ్యామ్, చక్రవర్తి, రామకష్ణ, కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. తొలుత సూర్యనారయణ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కతిక కార్యక్రమాలు అలరించాయి.

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-వన్‌టౌన్: టీడీపీ నేతల వేధింపులు, దాడికి గురైన వించిపేటలోని నందిని కుటుంబాన్ని సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పరామర్శించారు. అ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ వివాహితను వేధించి ఆమె కుటుంబంపై దాడులకు పాల్పడిన టిడిపి చెందిన రమణ, నరేష్‌లను కఠినంగా శిక్షిస్తామన్నారు. ఈ ప్రాంతంలో నిరంతర గస్తీ, పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని నగర పోలీస్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. వెలంపల్లి మాట్లాడుతూ టిడిపి డివిజన్ అధ్యక్షుడు వడ్డాది రమణ, అతని తమ్ముడు నరేష్ చేసిన ఆగడాలు బాధాకరమన్నారు. చంద్రబాబు వీటిపై స్పందించాలన్నారు.

ధాన్యం డబ్బులు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని కోరుతూ తహసీల్దార్ ఎం.పాల్‌కు రెడ్డిగూడెం మండల రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మాట్లాడుతూ ధాన్యాన్ని కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బు జమ అవుతుందని ఒకవైపు ముఖ్యమంత్రి చెబుతున్నారని, ఆచరణలో అది సాధ్యం కావడంలేదని అన్నారు. వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాని పక్షంలో ఆందోళన చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు అప్పిరెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గొడవర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. రామ లక్ష్మణ్ ఆధ్వర్యంలో రామిశెట్టి సాయి సంగమేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో గ్రౌండ్‌లో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలై తమ భవిష్యత్తును పాడు చేసుకోకుండా క్రీడల వైపు దృష్టి సారించాలన్నారు. ఇటీవల కాలంలో జరిగిన జగనన్న క్రీడా సంబరాలలో జగ్గయ్యపేట క్రికెట్ క్రీడాకారులకు జిల్లాలో 3వ స్థానం లభించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, కౌన్సిలర్లు కొలగాని రాము, వట్టెం మనోహర్, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, పట్టణ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ మొహిద్దీన్, డిపో మేనేజర్ ప్రసాద్, పట్టణ ఎస్ఐ రామారావు, క్రికెట్ కోచ్ రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్పోర్ట్స్ మీట్

ప్రజాశక్తి-విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో కార్పొరేటర్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న వివిధ రకాల పోటీలను అధికారులతో కలిసి లాటరీ విధానం ద్వారా పోటీ చేయు టీమ్‌ల వివరాలను మేయర్ ఎంపిక చేశారు. ప్రధానంగా ఈ స్పోర్ట్స్ మీట్‌లో 100, 400 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, 400 మీటర్ల నడక, షార్ట్‌పుట్, షటిలం బ్యాట్‌మెంట్, క్రికెట్, వాలీబాల్, కబాడీ, టెన్నిస్, చెస్, త్రోబాల్, టెన్నికాయిట్ వంటి పోటీలను నిర్వహించడం జరుగుతుందని మేయర్ వివరించారు. మేయర్ జట్టు, కమిషనర్ జట్టు, మునిసిపల్ రెవెన్యూ, ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్, టౌన్‌ప్లానింగ్, యుసిడి, ఎడ్యుకేషన్, రెవెన్యూ, మహిళా పోలీసు జట్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ఆటల ప్రతిభను ప్రదర్శించనున్నట్లు మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విఎంసి స్పోర్ట్స్‌మీట్ అధికారులు డిఎఫ్ఒ శ్రీనివాస్, అదనపు కమిషనర్ (జనరల్) ఎం శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కెవి సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ సిటీ ప్లానర్ జుబిన్ శిరన్‌రాయ్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి వెంకటలక్ష్మి, ప్రాజెక్టు ఆఫీసర్ కె శకుంతల పాల్గొన్నారు.

లాటరీ తీస్తున్న మేయర్, పక్కన డిఎఫ్ఒ

సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి-చందర్లపాడు: మండలంలోని కోనాయపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సప్తగిరి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఖాతాదారులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖాతాదారులకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన సేవలు అందిస్తూ సప్తగిరి గ్రామీణ బ్యాంక్ పలు బ్రాంచ్‌లను ఏర్పాటు చేస్తూ తమ సేవలను విస్తరించడం అభినందనీయమన్నారు.

నేడు విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-వన్‌టౌన్: భవానీపురం పరిధిలోని 11 కె.వి. టీచర్స్ కాలనీ ఫీడర్ లైన్ల మరమత్తులలో భాగంగా టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్ఎఫ్‌టి బ్లాక్‌ల వరకూ మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు (2గంటల) పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విజయవాడ టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.

వృక్షాల నరికివేత బాధాకరం : సౌమ్య

ప్రజాశక్తి-నందిగామ: వేసవికాలంలో నీడనిచ్చే మహా వక్షాలను నరికి వేయడం బాధాకరమని మాజీ ఎంఎల్ఎ తంగిరాల సౌమ్య సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో చెట్లను ఇష్టం వచ్చినట్లు నాశనం చేస్తున్న తీరు చూస్తుంటే భవిష్యత్తులో ఊపిరి తీసుకోవడానికి ఆక్సిజన్ కొనుక్కోవాల్సిన పరిస్థితి రానుందని తెలిపారు. చెట్ల నరికివేత వల్ల వచ్చిన ఆదాయాన్ని అధికారులు ప్రభుత్వానికి చెల్లించారా అని ప్రశ్నించారు. రోడ్ల పనులు పూర్తయిన అనంతరం ఎవరు మొక్కలు నాటతారని ప్రశ్నించారు.

పైపులైను పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

రానున్న వేసవి కాలం దృష్ట్యా పట్టణంలో అన్ని వార్డులలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా యుద్ధప్రాతిపదికన ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అధికారులకు సూచించారు. పట్టణంలోని డాంగేనగర్ వాటర్ ట్యాంకు వద్ద పైపు లైన్ పునర్ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఎక్కడ కూడా నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-చందర్లపాడు

మండలంలోని గుడిమెట్ల గ్రామంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెకంటి జీవరత్నం ఆధ్వర్యంలో నందిగామలోని ఐకాన్ కేర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఐకాన్ కంటి ఆసుపత్రి డాక్టర్ భార్గవ్, డాక్టర్ మన్నెం నవ్య, డాక్టర్ కృష్ణ చైతన్య వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆల చినసైదమ్మ , మండల వైస్ ఎంపీపీ చెన్నవరపు కల్పన, మాజీ సర్పంచ్ బొడేపుడి వేణుబాబు, మర్రిబోయిన బుజ్జి, బోడేపూడి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గడువుదాటిన అర్జీలు వెంటనే పరిష్కరించాలి :కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో ఈ ఏడాది పదోతరగతి, మొదటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో సందేహాల నివృత్తికి మొబైల్/వాట్సాప్ నెంబరు జిల్లా కలెక్టరు పి. రంజిత్ బాషా ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందనలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో స్పందన అర్జీలు పరిష్కారానికి సంబంధించి గడువుదాటినవి 7, రీ ఓపెన్ 6 వచ్చాయని, వీటిని వెంటనే పరిష్కరించాలన్నారు. 2023 సంవత్సరంలో జరగబోవు ఎస్ ఎస్ సి, మొదటి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరగు విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఎదురయ్యే సందేహాలను సబ్జెక్టు ఎక్స్‌పర్టచే నివృత్తి చేయించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆన్ లైన్ ప్రోగ్రాం నూతనంగా ఏర్పాటు చేసిందన్నారు. ఇందుకోసం మొబైల్ వాట్సాప్ నెంబరు 8247800205 సేవలను నూతనంగా ప్రారంభించారు. ఈ ఏడాది జిలలో ప్రతి మండలంలో ఒక హైస్కూలులో ప్రభుత్వం ప్రారంభించిన మహిళా జూనియర్ కళాశాలల విద్యార్థులతో పాటు ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎస్సి చదివే విద్యార్థులు ఈ సౌకర్యం వినియోగించుకోవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డిజిటల్ అవేర్ నెస్, సేవింగ్స్, ప్లానింగ్ బడ్జెటింగ్ ముఖ్యాంశాలతో ఈ నెల 13 నుండి వారం రోజులపాటు జిల్లాలో అన్ని బ్యాంకుల్లో ఆర్థిక ఫైనాన్షియల్ లిటరసీ వీక్ నిర్వహిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఎల్డిఎం సాయిరాం, అధికారులతో కలిసి కలెక్టరు పోస్టరు ఆవిష్కరణ చేశారు. ఈ సమావేశంలో డిఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ముడ విసి బి. శివనారాయణ, రెడ్డి, ఆర్డీఓ ఐ.కిషోర్, డిపిఓ నాగేశ్వరనాయక్, డిఎల్డీవో సుబ్బారావు, డిఇవో తాహెరా సుల్తానా, డిఎం అండ్ హెచ్ వో డా. గీతాబాయి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కెడిసిసి బ్యాంక్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మోపిదేవి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రైతులకు న్యాయం జరుగుతుందని కృష్ణాజిల్లా కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు కొనియాడారు. కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు మోపిదేవి బ్రాంచ్ నూతన భవన నిర్మాణానికి శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబుతో కలిసి తన్నీరు నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఏజిఎం నోడల్ అధికారి జి సూర్యప్రకాశరావు, బ్రాంచ్ మేనేజర్ నూకల త్రివిక్రమరావు ల ఆధ్వర్యంలో ఒక కోటి తొమ్మిది లక్షల 24 వేల రూపాయల నిధులతో అత్యాధునిక హంగులతో నిర్మించబోయే భవన నిర్మాణానికి సింహాద్రి, తన్నీరు లు శాస్త్రవేత్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు శిలాఫలకాన్ని సాంప్రదాయ బద్ధంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సి.ఇ.ఓ ఏ శ్యామ్ మనోహర్, జిల్లా డైరెక్టర్ గడిదేసి పెద వెంకయ్య, దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, జడ్పిటిసి సభ్యులు మేడబలిమి మల్లికార్జునరావు, సర్పంచ్ నందిగం మేరీ రాణి పాల్గొన్నారు.

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కార్యాలయం సందర్శించిన జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ మచిలీపట్నంలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కార్యాలయం, శిశు గృహ బాలసదనంలను సోమవారం సందర్శించారు. నిర్మాణంలో ఉన్న శిశు గృహాన్ని పరిశీలించారు. వాటి నిధుల విడుదలకు తగిన చర్యలు తీసుకోవాలని ఆ శాఖ డైరెక్టర్ కు సూచించారు. వెంటనే శిశు గృహనిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా మహిళా శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి సువర్ణ ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

మృతుడి కుటుంబానికి సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని 19.వ డివిజన్ రైలు పేట పరిధిలో జుబేదా భర్త కాశిం ఇటీవల అనారోగ్యంతో మతిచెందారు. భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించే కాసిం మరణించడం తో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మతుని భార్య జుబేదాకు జనసేనపార్టీ ఇన్చార్జి బండి రామకృష్ణ మరియు ముస్లిం మైనారిటీ హక్కుల వేదిక సభ్యులు అండగా నిలిచారు. ముస్లిం మైనార్టీ హక్కుల సభ్యులు 3,000 వేలు, బండి రామకృష్ణ 8,000 వేలు మొత్తం 11 వేల నగదుతో పాటు నిత్యావసరాలు సంయుక్తంగా అందజేశారు. జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, మైనార్టీ హక్కుల నాయకులు సిద్దిక్, దాదా, పినిశెట్టి కుమారి పాల్గొన్నారు.

లంకపల్లిలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-గన్నవరం : ఉంగుటూరు మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు ఆరుమాళ్ళ వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి మాయ రమేష్, వాసు, జల్లెడ శ్రీమన్నారాయణ, కనక సుందరరావు, మంగారావు,వల్లభనేని రంగారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరుమాళ్ళ వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా వ్యవహారం చడంతో రైతులు దగా పడుతున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల మేర వడ్లను తరుగు పేరుతో అదనంగా రైతుల నుంచి దండుకుంటున్నారని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమంలో పాల్గొన్న ఆరుమాళ్ళ వెంకట కృష్ణారెడ్డి

జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పొందుటకు అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ ,బిసి ,కాపు, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతుల విద్యార్థిని విద్యార్థులకు సంబంధించి జ్ఞానభూమి వెబ్సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని కృష్ణా జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి కె. సరస్వతి తెలిపారు. సోమవారం కృష్ణవేణి ఐటిఐలో జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ అందరికి జ్ఞానభూమి వెబ్ సైట్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని ప్రిన్సిపాల్స్ అందరూ తమ కళాశాలలోని జగనన్న విద్యాదీవెన మరియు వసతి దీవెన పొందుటకు అర్హత కలిగిన రెన్యువల్ మరియు ఫ్రెష్ విద్యార్థిని/విద్యార్థుల వివరములను జ్ఞానభూమి వెబ్ సైట్ లో నిర్ధారించాలన్నారు. అలాగే అర్హత కలిగిన విద్యార్థులందరి చేత ఆధార అంథేనికేషన్ చేయించాలన్నారు. వివరాలను ఈ నెల 15 తేదీలోపు పూర్తి చేసిన యెడల విద్యార్థులందరికి ఈ నెల 28 వ తేదీన జగనన్న విద్యాదీవెన మొదటి విడత ఫీజులు పొందుటకు అర్హులుగా ఎంపికవుతారన్నారు.

నేటి నుండి బెజవాడ-ధర్మవరం ఎక్స్‌ప్రెస్

- మచిలీపట్నం వరకు పొడిగింపు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : విజయవాడ నుండి ధర్మవరం రైలు నంబరు 17215 (బెజవాడ ధర్మవరం ఎక్స్‌ప్రెస్) నేటి నుండి మచిలీపట్నం వరకు పొడిగించినట్లు సోమవారం పబ్లిక్ రిలేషన్స్ అధికారి ఎం మందప్పర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి విజయవాడ రైల్వేస్టేషనులో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జెండా ఊపి ప్రారంభిస్తారన్నారు.ఈ రైలు విజయవాడ నుండి రాత్రి 9.45 కు బయలుదేరి గుంటూరు, వినుకొండ, గిద్దలూరు, నంద్యాల, ప్రొద్దుటూరు, తాడిపత్రి, అనంతపురం మీదుగా ధర్మవరం జంక్షన్ ఉదయం 11 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ధర్మవరం నుండి సాయంత్రం 5.35 కు బయలుదేరి విజయవాడకు ఉదయం 7 గంటలకు చేరుతుందన్నారు. రైలును విజయవాడ నుండి మచిలీపట్నం వరకు పొడిగించటంతో మచిలీపట్టణం నుండి సాయంత్రం 7.40 కు బయలుదేరుతుందని తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లలో సందడి

- నేటితో ముగియనున్న ఉత్సవాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : వీరమ్మ తిరునాళ్లకు సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గొర్రెపోతేళ్ల ప్రభ బండ్లు, డప్పువాయిద్యాలతో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళ లు పసుపు కుంకు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కుతీర్చుకున్నారు. క్యూలైన్ల నిండి పోగా ఆలయ ప్రాంగణంలో ఎండలో సైతం బారులు తీరి అమ్మవారిని దర్శించు కున్నారు.



నేటితో ముగియనున్న తిరునాళ్ల : వీరమ్మ తిరునాళ్ల మంగళవారంతో ముగియ నున్నాయి. తిరునాళ్ల చివరి రోజు రాత్రి తిరునాళ్ల ముగించుకుని ఊరేగింపుగా బయలుదేరి తిరిగి మెట్టినింటికి చేరతారు. చివరిరోజు భక్తులు తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారని భావిస్తున్నారు.

10వేల మందికి అన్న సమారాధన : వీరమ్మ తిరునాళ్లలో సోమవారం 10వేల మంది భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేశారు. తిరునాళ్లలో ప్రతియేటా కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన చేయడం ఆనవాయితీ. అమ్మవారి భక్తులకు అన్న సమారాధన చేయడం అదృష్టంగా భావిస్తున్నామని కమిటీ సభ్యులు పారుపూడి సుబ్బారావు, శ్రీను, వీరకుమార్ తెలిపారు. పలువురు సభ్యులు, భక్తులు పాల్గొని సేవలందించారు.

పంట నమోదుకు వేలిముద్రలు తప్పనిసరి

ఈ-క్రాప్ నమోదు రికార్డులు పరిశీలిస్తున్న ఆత్మ డైరెక్టర్ ప్రమీల

ప్రజాశక్తి - గుడివాడ : రైతు భరోసా కేంద్రాల్లో పంట నమోదు చేసుకున్న రైతులు తప్పని సరిగా వేలిముద్రలు ఇవ్వాలని ఆత్మ డైరెక్టర్, జిల్లా వ్యవసాయ అదనపు సంచాలకులు వారు డి. ప్రమీల అన్నారు. సోమవారం జిల్లా వ్యవసాయ కమిషనరేట్ కార్యాలయం నుంచి వచ్చిన ఆమె గుడివాడ మండలంలోని అల్లిదొడ్డి రెవెన్యూ పరిధిలోని ఈ క్రాప్ లో నమోదు చేసిన మినుము పంటకు భూమి మీద ఉన్న పంటకు వ్యత్యాసం ఏమ్మైనా ఉందా లేదా అని తనిఖీ చేశారు. ఏదైన పంటకు నష్టం వాటిల్లినా, పంటకు గిట్టుబాటు ధర లేక పోయినా ఉప యుక్తముగా ఉంటుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గుడివాడ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్. రమాదేవి, మచిలీపట్నం, గుడివాడ ఏఓలు జి.శివ ప్రసాద్, బి.అంత లక్ష్మి, గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, వీఆర్వో , రైతులు పాల్గొన్నారు.

ఆవాసాల మధ్యే చెత్త కుప్పలు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆవాసాల మధ్య చెత్త కుప్పలు పాచి పోగులు వేయటం వలన అనారోగ్యం పాలవుతున్నామని ఆ ప్రాంతవాసులు గగ్గోలు పెడుతున్నారు. మండల పరిధిలోని వెలువోలు దళితవాడలో దశబ్దాల క్రితం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గ్రామచావిడి ఏర్పాటు చేశారు. కాలనీవా సులందరూ ఆ చావిడి ప్రాంగణంలో

పిల్లలు పెద్దలు ఆటపాటలు కొనసాగించేవారు. ప్రభుత్వ అధికారులు పంచాయతీ అధికారులు ఏ సమావేశం ఏర్పాటు చేసిన ఈ చావిడే ఆధారం. క్రమేపి చావిడి శిథిలం కావటంతో పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. పరిసర ప్రాంతం వారు స్థలాన్ని కబ్జా చేసి పశువుల పాకలు ఏర్పాటు చేసి పాచి పోగులు చెత్త కుప్పలు అక్కడ వేయటంతో దోమలు, ఈగలకు.నిలయంగా మారాయి. వర్షాకాలం వాటి నుండి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ఆ ప్రాంత వాసులు పేర్కొంటున్నారు. పాచి పోగులు చెత్తకుప్పలపై వాలే ఈగలు దోమల వల్ల అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు పాచి పోగులు చెత్త కుప్పలు తొలగించాలని,ఆ ప్రాంతంలో పూల మొక్కలు నాటి గార్డెన్ గా తయారు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు

అడుసుమిల్లి గోపాల కృష్ణయ్య, చెరకు రైతుల డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో సోమవారం కెరీర్ గైడెన్స్ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రముఖ చార్టర్ అకౌంటెంట్ డి. కృష్ణార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులు, యువకులకు కెరీర్ పై అవగాహన కల్పించారు. సిఏ, సిఎంఏ, సిఎస్ కోర్సులకు మంచి భవిష్యత్ ఉన్నప్పటికి అవగాహనలేక చాలీ చాలని జీతాలతో జీవనాన్ని గడుపుతున్నారన్నారు. కష్టపడి కామర్స్ కోర్సులు పూర్తి చేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వాణిజ్య విభాగ అధిపతి ఎన్. వసంతరావు, అధ్యాపకు లు శేఖర్ బాబు మనోహరి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో 79 అర్జీలు నమోదు

ప్రజాశక్తి - విజయవాడ : స్పందనలో నమోదైన అర్జీలకు నిర్ధేశించిన గడువులోగా పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్ తదితరులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో ఒకసారి నమోదైన అర్జీ తిరిగి నమోదు కాకూడదన్నారు. స్పందనలోని ప్రతి ఫిర్యాధును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రజలకు సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. సోమవారం స్పందనలో 79 వినతులు నమోదు కాగా, వీటిలో అత్యధికంగా రెవెన్యూ శాఖలో 30, పోలీస్ 17, యంఎయుడి 5, సర్వే అండ్ సెటిలిమెంట్ 4, పౌర సరఫరాల శాఖ 4, పంచాయతీరాజ్ 3, ఎపిఎస్‌పిడిసిఎల్ 3,అటవీ 3, ఉపాధి కల్పన 3, విద్యా 1, దేవాదాయ శాఖ 1, ఆర్‌అబ్ల్యుఎస్ 1, సహాకార శాఖ 1, మత్స్య 1, కాలుష్య నియంత్రణ మండలి 1, సంఘీక సంక్షేమం 1 శాఖలలో అర్జీలు నమోదయ్యాయన్నారు.

స్పందన అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ డిల్లీరావు

జిల్లాలోని డివిజనల్ అధికారులు, ఆయా మండలాల యంపిడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో వర్చువల్‌గా జిల్లా కలెక్టర్ పరిష్కారమయ్యే వినతులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో డ్వామా పీడీ జె.సునీత, డిఎస్‌వో పి కోమలి పద్మ, ఐసిడిఎస్ పీడి జి. ఉమాదేవి, డియంహెచ్‌వో డా. యం సుహాసిని, డిసివో సిహెచ్ శైలజ, డిఆర్‌డిఏ పీడి కె. శ్రీనివాసరావు, పశుసంర్ధక శాఖ జెడి కె. విద్యాసాగర్, గ్రామ వార్డు సచివాలయ ప్రత్యేక అధికారి కె. అనురాధ, ఉద్యాన శాఖ జిల్లా అధికారి బాలాజీ కుమార్, హౌసింగ్ పీడి శ్రీదేవి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి యం. విజయభారతి పాల్గొన్నారు.

జిజిహెచ్ వద్ద ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి)

సంఘటనలు పునరావృతం కావన్నారు. పోలీసుల నిర్లక్ష్యం వల్లే ఈదారణం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద ఉంటున్న ప్రజల ప్రాణాలకే భరోసా లేకపోతే రాష్ట్రంలో నివసిస్తున్న నమహిళల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గతంలో జగన్ నివాసం వద్ద ఓ మహిళపై జరిగిన అత్యాచార ఘటనలో ఇంతరవకు నిందితులను పట్టుకోలేదన్నారు. బాధితులకు న్యాయం జరగలేదని, మీరు చెపుతున్న దిశా చట్టం , పోలీసులు ఎక్కడ ఉన్నారని నిలతీశారు.

మతురాలి కుటుంబానికి రూ.10 లక్షల సాయం

ప్రభుత్వాస్పత్రి వద్దకు వచ్చిన తాడేపల్లి ఇన్చార్జి తహశీల్దారు రాంప్రసాద్ చేరుకుని బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున మతిరాలి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు.

అర్జీలు స్వీకరించిన మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి - విజయవాడ : మేయర్ రాయన భాగ్యలక్ష్మి సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి 14 ఆర్జీలను స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలపై అధికారులను వివరాలు అడిగితెలుసుకొన్నారు. పట్టణ ప్రణాళిక నుండి 6 ఇంజనీరింగ్ 3, రెవిన్యూ 2, ప్రజారోగ్య 1, యుసిడి విభాగానికి చెందిన 2 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీమతి యం.శ్యామల, అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి సత్యవతి, చీఫ్ ఇంజనీర్ యం. ప్రభాకరరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) డి.వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ జి.వి.జి. ఎస్.వి ప్రసాద్, ఎస్ఇ నరసింహ మూర్తి, ప్రాజెక్ట్ ఆఫీసర్ శకుంతల, మేనేజర్ బి.శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న మేయర్ రాయన

గాయపడిన విద్యార్థులను ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి ఏడాది కాన్వకేషన్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కృష్ణా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.సుఖేష్, ఎస్.సమరం, బాలికల విభాగం నాయకురాలు కవిత, పెద్దఎత్తున సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిస్కారానికి కృషి : విసి

గాయపడిన విద్యార్థుల వైద్య ఖర్చులు ఎగ్జిక్యూటివ్ కమిటీ (ఇసి)తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వర్సిటీ విసి కె రామమోహనరావు తెలిపారు. ప్రస్తుతం వైద్య ఖర్చులను వర్సిటీ భరిస్తోందన్నారు. పది రోజుల్లో వసతి గృహం నిర్మాణ పనులను ప్రారంభించి ఆరు నెలల్లో పూర్తి చేస్తామని విసి హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసిందన్నారున. అలాగే అదనపు బస్సుల కోసం ఆర్‌టిసి యాజమాన్యంతో చర్చిస్తామని తెలిపారు.

పవన్‌కు పలువురు నేతల పరామర్శ

పోలీసుల దాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఎఫ్ఐ నాయకుడు పవన్‌కుమార్‌ను పలువురు నాయకులు పరామర్శించారు. సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.రఘు, నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొడాలి శర్మ, సిహెచ్.జయరావు, నాయకులు వేణు, సిఐటియు జిల్లా నాయకులు పోలినాయుడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సమరం, సుఖేష్, నాయకులు కీర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి యు.జ్యోతి, నగర కార్యదర్శి సి.హెచ్ జయలక్ష్మి, పిఎన్‌యు పట్టణ నాయకులు నాగయ్య తదితరులు పరామర్శించారు.

ప్రజాసంఘాల నేతల పరామర్శ

మాట్లాడుతున్న విసి రామమోహనరావు

పాస్ పోర్ట్ పోయినది

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం, కంచికచర్ల గ్రామానికి చెందిన బూర్గుల భార్గవ్ చందు (తండ్రి) శ్రీనివాసరావు కు చెందిన పాస్ పోర్ట్ పోయినది. భారత ప్రభుత్వం జారీ చేసిన పాస్ పోర్ట్ నెంబర్ **K7309971** గల పాస్ పోర్ట్ ఈ నెల 7 వ తేదీన కంచికచర్ల లో బస్టాండ్ సమీపంలో గల ఇంటి నుండి వేరే ఇంటికి మారుతున్న సమయం లో పాస్ పోర్ట్ పోయినది. పై నెంబర్ గల పాస్ పోర్ట్ దొరికిన వారు **9676183193** నెంబర్ కు సమాచారం అందించగలరు.

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, KRISHNA, MACHILIPATNAM.
I.A. 379/2022 in OS. 88/2015

Between :
Siddhabathula Venkata Adi Lakshmi (died) & Puvvula Kalpana Rai & Others
... Petitioners / Plaintiffs
And
M.Vinodbala (Died) & others
.... Respondents / Respondents

R3 : Mekala Rukmini W/o. Venkateswara Rao, Hindu, age 60 years, D.No. 8-19-1/17, Arundati Nagar, 1st Line, Beside Street of Maruthi Show Room, Guntur.
R9 : Maddila Ajay Kumar, S/o. Satya narayana, D.No. 4/143, Hindu, age : 32 years, Ramanaidu pet, Machilpatnam, Krishna District.

పై నెంబరు I.A. 379/2022 in OS 88/2015లో రెస్పాండెంట్స్ 3 & 9 గార్లకు నోటీసు అమలు నిమిత్తం ది. 28-2-2023న వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరయి పై నెంబరున ఎట్టి ఆక్షేపణలు వున్నా తెలుపుకొనగలరు. లేనియెడల తదుపరి గ్రంథములు జరిపించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు.
పేర్ని సురేష్‌బాబు,
అడ్వకేట్,
డోర్ నెం.14-119/2బి,
ఈడేపల్లి, మచిలీపట్నం.
ఫోన్ : 9346422969
మచిలీపట్నం
తేది: 9-2-2023

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, KRISHNA, MACHILIPATNAM.
I.A. 380/2022 in OS. 88/2015

Between :
Siddhabathula Venkata Adi Lakshmi (died) & Puvvula Kalpana Rai & Others
... Petitioners / Plaintiffs
And
M.Vinodbala (Died) & others
.... Respondents / Respondents

R3 : Mekala Rukmini W/o. Venkateswara Rao, Hindu, age 60 years, D.No. 8-19-1/17, Arundati Nagar, 1st Line, Beside Street of Maruthi Show Room, Guntur.
R9 : Maddila Ajay Kumar, S/o. Satya narayana, D.No. 4/143, Hindu, age : 32 years, Ramanaidu pet, Machilpatnam, Krishna District.

పై నెంబరు I.A. 380/2022 in OS 88/2015లో రెస్పాండెంట్స్ 3 & 9 గార్లకు నోటీసు అమలు నిమిత్తం ది. 28-2-2023న వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరయి పై నెంబరున ఎట్టి ఆక్షేపణలు వున్నా తెలుపుకొనగలరు. లేనియెడల తదుపరి గ్రంథములు జరిపించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు.
పేర్ని సురేష్‌బాబు,
అడ్వకేట్,
డోర్ నెం.14-119/2బి,
ఈడేపల్లి, మచిలీపట్నం.
ఫోన్ : 9346422969
మచిలీపట్నం
తేది: 9-2-2023

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR
DISPUTE No. 119 of 2022

Between:-
M/s Niargadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenali ... Disputant
and
Mr. M.Rajesh and Others... Opponents
OPPONENT -1
Mr. Mamillapalli Rajesh S/o Srinivasa Rao Pharmacy Incharge, Modem Retina Centre D.No.29-29-4, Kaleswara Rao Road, Survarao Pet, Vijayawada, Krishna Dist.
OPPONENT-5
Mr. Samudrala Chandra Sekhar S/o Lakshminadha Rao, Prop: Mis Alekhva Saree House. D.No.42--42-15, Bapuji Street, M K Baig Mpl. School Backside Ajith Singh Nagar, Vijayawada, Krishna Dist.

Whereas the above named Disputant filed the above Dispute against you for recovery of a sum of Rs.1,00,021.00 for notice of you that you are hereby required to appear before the Deputy Registrar of Chits, Guntur on 21-02-2023 at 11.00 a.m. either personally of through an advocate and for your defence / objections. If you fail to attend the office of the DeputvRegistrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits)
BMSD PRASAD,
ADVOCATE, TENALI

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS: GUNTUR
DISPUTE No. 116 of 2022

Between :
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd., Station Road, Tenaji ....Disputant
and
Mr. N.Satish and others....... Opponents
OPPONENT -1
Mr. Nallamalli Satish S/o Venkateswarlu Prop: Mis Amaravathi Tiffin & Tea Center Near Andhra Bank, M G Road, Bapatla Po & Mdl., Guntur Dist.
OPPONENT-6
Mr. Nallamalli Naga Raju S/o Venkateswarlu, D.No.32-37-3, Water Tank Road, Machavaram, Vijayawada, Krishna Dist.

Whereas the above named Disputant filed the above Dispute against y eb for recovery of a sum of Rs.1,97,161.00 for notice of vou that you are her required to appear before the Deputy Registrar of Chits, Guntur on 21-02-2023 at 11.00 a.m. either personally of through an advocate and for your defence objections. Ifyou fail to attend the office of the DeputyRegistrar of Chits on that day the matter will be heard and decided exparty basis on the material available.
(By order of the Deputy Registrar of Chits)
BMSD PRASAD
ADVOCATE, TENALI

IN THE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, KRISHNA, MACHILIPATNAM.
I.A. 381/2022 in OS. 88/2015

Between :
Siddhabathula Venkata Adi Lakshmi (died) & Puvvula Kalpana Rai & Others
... Petitioners / Plaintiffs
And
M.Vinodbala (Died) & others
.... Respondents / Respondents

R3 : Mekala Rukmini W/o. Venkateswara Rao, Hindu, age 60 years, D.No. 8-19-1/17, Arundati Nagar, 1st Line, Beside Street of Maruthi Show Room, Guntur.
R9 : Maddila Ajay Kumar, S/o. Satya narayana, D.No. 4/143, Hindu, age : 32 years, Ramanaidu pet, Machilpatnam, Krishna District.

పై నెంబరు I.A. 381/2022 in OS 88/2015లో రెస్పాండెంట్స్ 3 & 9 గార్లకు నోటీసు అమలు నిమిత్తం ది. 28-2-2023న వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదారోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరయి పై నెంబరున ఎట్టి ఆక్షేపణలు వున్నా తెలుపుకొనగలరు. లేనియెడల తదుపరి గ్రంథములు జరిపించబడునని యిందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు.
పేర్ని సురేష్‌బాబు,
అడ్వకేట్,
డోర్ నెం.14-119/2బి,
ఈడేపల్లి, మచిలీపట్నం.
ఫోన్ : 9346422969
మచిలీపట్నం
తేది: 9-2-2023

మహారాజశ్రీ గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం. 391/2016 ఇన్ ఓ.ఎస్.15/2014

కోగంటి శివరామవరప్రసాద్, తండ్రి లేటు నాగభూషణం, హిందు, వయసు 67 సం॥లు డోర్ నెం. 42-2/1-132, DRWA 266, దేవినగర్, విజయవాడ - పిటిషనర్

వర్సెస్

ఆర్2. కోగంటి రామబ్రహ్మం, తండ్రి లేటు నాగభూషణం, హిందు, 70 సం॥లు 1210, రైల్వేగేటు దగ్గర, ఇందుపల్లి, ఉంగుటూరు మండలం, కృష్ణాజిల్లా.
ఆర్3. కోగంటి నాగ చంద్రశేఖరరావు, తండ్రి లేటు నాగభూషణం, హిందు 60 సం॥లు C/o. జాస్తి ప్రభాకరరావు, అన్నవరం, నూజివీడు మండలం, కృష్ణాజిల్లా.
ఆర్5. దాసరి వెంకట సత్యనారాయణమ్మ, భర్త వెంకటేశ్వరచౌదరి, హిందు, 64 సం॥లు రిటైర్డ్ ఆర్.టి.సి డ్రైవర్, C/o డి.వెంకటాద్రి, మోటర్‌సైకిల్ మెకానిక్ షెడ్, ఆర్.టి.సి. డిపో ప్రక్కన, గుడివాడ, కృష్ణాజిల్లా.
ఆర్ 6. యలవర్తి లలితకుమారి, భర్త శ్రీకృష్ణ, హిందు, వయస్సు 55 సం॥లు, మార్చురీ బాక్సు సప్లయ్ ఆఫీసు, స్మశానం ఎదురు, మాచవరండౌన్, విజయవాడ. - రెస్పాండెంట్

వాయిదా తేది: 13-03-2023

పై నెంబరు ఐ.ఎ. 391/2016 లో మీకు కోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపగా సదరు నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేసినందున సదరు నోటీసులు అమలుకుగాను కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము తెలియపరచడమైనది కావున పై తేదిన ఉదయం 10-30.ని॥లకు మీరు స్వయముగా గాని, ప్లీడరు గారు ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్నచో తెలియపరచుకోవలెను. లేనిచో పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.
వాయిదా తేది: 13-3-2023.

ఇట్లు
జాస్తి తాతారావు,
పిటిషనరు తరపు న్యాయవాది,
గన్నవరం

బహిరంగ నోటీసు
మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టు
ఐ.ఎ. 57/2022 ఇన్ సి.ఎమ్.ఎ. 5/2021
ఐ.ఎ. 58/2022 ఇన్ సి.ఎమ్.ఎ. 5/2021
ఐ.ఎ. 59/2022 ఇన్ సి.ఎమ్.ఎ. 5/2021

కాకర్ల మురళి వగైరాలు ....పిటిషనర్లు/అప్లెంట్
మరియు
మీసాల కళావతమ్మ వగైరాలు .....రెస్పాండెంట్స్

23వ రెస్పాండెంట్ శ్రీమతి మీసాల సత్యవతి, భర్త లేటు శ్రీనివాసరావు, వయస్సు 34 సం॥లు, నివాసము విజయదుర్గ నగర్, బుడమారకట్ట, విజయవాడ పట్టణం, కృష్ణా జిల్లా.

24వ రెస్పాండెంట్ శ్రీ మీసాల జ్ఞానేశ్వర రావు, తండ్రి లేటు శ్రీనివాసరావు, వయుస్సు 11 సం॥లు, నివాసము విజయదుర్గ నగర్, బుడమారకట్ట, విజయవాడ పట్టణం, కృష్ణా జిల్లా.

25వ రెస్పాండెంట్ శ్రీ మీసాల జాహ్నవి, తండ్రి లేటు శ్రీనివాసరావు, వయుస్సు 7 సం॥లు, నివాసము విజయదుర్గ నగర్, బుడమారకట్ట, విజయవాడ పట్టణం, కృష్ణా జిల్లా.

(24వ మరియు 25వ రెస్పాండెంట్లు మైనర్లు అయినందున తల్లియైన 23వ రెస్పాండెంట్ సంరక్షకరాలు అయినందున 24వ మరియు 25వ రెస్పాండెంట్లు తరుపున గార్డియన్ గా వ్యవహరిస్తున్నారు).

పై నెంబరు అప్పీల్‌లో వాదులు అయిన కాకర్ల మురళి వగైరాలు పై నెంబరు అప్పీల్లో మహారాజశ్రీ రాజాం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో 3వ రెస్పాండెంటు పైన మరియు ఇతర ప్రతివాదులు పైన క్రింది కోర్టు తీర్పును రద్దు పరిచే, వగైరా పరిహారములు కోరుతూ దాఖలు చేసి యున్నారు. సదరు అప్పీలులో చనిపోయిన 3వ రెస్పాండెంట్ వారసులుగా మిమ్మల్ను చేర్చుటకు గాను పై నెంబరు పిటిషన్లు సదరు అప్పీలులో దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లు మరియు అప్పీలు **తే.14.03.2023ది** నాటికి వాయిదా అయి ఉన్నది. కావున పైన పేర్కొన్న పిటిషన్లలో మరియు అప్పీలులో మీకు వాదన ఉన్న యెడల మీ వ్రాతమూలక స్టేట్మెంట్ వగైరాలు ఉన్న యెడల వాటితో సహ పై వాయిదా తేదిన, సదరు కోర్టులో వ్యక్తిగతముగా గాని లేదా తమ న్యాయవాది ద్వారాగాని హాజరై తమ వాదన మరియు లిఖితములను దాఖలు జేయవలసినదిగా మహారాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. పై చెప్పబడిన తేదీన హాజరు కాకుండ తప్పిపోయే యెడల మీ పరోక్షమందు పై వాద్యమును విమర్శ చేసి మహారాజశ్రీ కోర్టు వారు తీర్మానించడమగునని కోర్టు వారి ఉత్తర్వులు అనుసరించి ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

ఎమ్. బెనర్జీ
ఏడ్వోకేట్, బొబ్బిలి,
విజయనగరం జిల్లా,
సెల్ : 9440592366.

బీమా వ్యాపారాన్ని బలహీనపరుస్తున్న కేంద్రం : ఐసిఇయు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ అధ్వర్యంలో సోమవారం మచిలీపట్నంలో సెమినార్ నిర్వహించారు. కేంద్ర బడ్జెట్లో జరిగిన ఈ సెమినార్లో ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బడ్జెట్లో ఇన్సూరెన్స్ ప్రీమియంపై ఇచ్చే పన్ను రాయితీను తొలగించేలా చర్యలు చేపట్టడం ప్రజల పొదుపును, బీమా వ్యాపారాన్ని బలహీనపరిచే చర్య అని అన్నారు. ఈ బడ్జెట్ లో బీమారంగ వద్ధికి ఏ విధమైన పన్నురాయితీ, ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా పాలసీదారులకు భారంగా పరిణమించిన ఇన్సూరెన్స్ ప్రీమియంపై జిఎస్టీను తగ్గించే ప్రతిపాదన చేయకపోవడం వలన ప్రజల పొదుపుపై ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. కొత్త ఆదాయపు పన్ను శ్లాబులు ప్రకటించినప్పటికీ, ఉద్యోగులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నులో పెద్దగా మార్పు లేకపోవడం ఉద్యోగవర్గాన్ని నిరుత్సాహపరిచిందని పేర్కొన్నారు. ఆదాయ సంపదలలో పెరుగుతున్న వ్యత్యాసాలను తగ్గించటానికి చర్యలు చేపట్టకపోగా, కార్పొరేట్ వర్గాలకు వరాల జల్లును కురిపిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమములో ఐసిఇయు మచిలీపట్నం డివిజన్ నాయకులు జె. సుధాకర్, జి. కిషోర్ కుమార్, ఎల్. రాజశేఖర్, వి. రవీంద్రనాథ్ ఠాగూర్, బి. శ్రీనివాస్, ఎస్. రత్నారావు, ఎ. శ్రీనివాస రావు, బిహెచ్. మాధుర్, ఎంవైవిఎస్ఆర్. సుబ్రహ్మణ్యం, వై. స్వామినాథ్ తదితర యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-కోదూరు : కోదూరు మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ కోదూరు మండల జనసేన పార్టీ నేతలు స్పందన కార్యక్రమంలో భాగంగా కోదూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇంచార్జీవో ఎంపీడీవో నాగ రేవతికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య మాట్లాడుతూ కోదూరు మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా, దాదాపు 45 వేల మంది ప్రజానీకం ఉంటున్నారని, వేసవికాలం వచ్చిందంటే అగ్ని ప్రమాదాలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. వేసవికాలం ప్రారంభం కాకముందే చుట్టుపల గ్రామాల్లో ఇప్పటికే నాలుగు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, ఈ అగ్ని ప్రమాదాల వల్ల బాధితులు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో మిగిలిపోతున్నారన్నారు. అవనిగడ్డ నుండి ఫైర్ ఇంజన్ వచ్చేసరికి ఇక్కడ నష్టం పూర్తిస్థాయిలో జరిగిపోతుందని ఆమె అన్నారు. కావునా వెంటనే ఫైర్ ఇంజన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిట్టలంక గ్రామ సర్పంచ్ కనకాల వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బావిశెట్టి ప్రభాకర్ రావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు తోడ సోమశేఖర్రావు, జరుగు ఆదినారాయణ ,కార్యదర్శి ఆలమూడి సురేష్, పార్టీ నేతలు మేడ పిచ్చియ్య సజ్జ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ కైలే జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పెదపారుపూడి : పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనీల్ కుమార్ జన్మదిన వేడుకలు పెదపారుపూడి మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన పెదపారుపూడి చెరువుగట్టు రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద పిఎసిఎస్ అధ్యక్షుడు తుమ్మల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ ను కట్ చేసి వైసిపి నాయకులకు కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడు జాజుల నాగరాజు బొల్లవరపు దాసు బొల్లవరపు శారాబంది కంభం డేవిడ్ సువర్ణ రాజు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి -మొవ్వ : ఈ ఏడాది జనవరి నెల నుండి రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంభవించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే రైతు ఖాతాలలో జమ చేయాలని ఏపి కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ ధాన్యం సేకరించిన ఇరవై రోజుల్లో రైతు ఖాతాలో నగదు జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దాదాపు యాభై రోజులు అవుతున్నా నగదు చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రకృతి ప్రకోపానికి గురై దెబ్బతిన్న రైతులు భయట పడేలకు అరువు తెచ్చి పరికుప్పల మాసూళ్ళు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులకు ప్రభుత్వం సకాలంలో నగదు జమ చేయకపోవడం వారిని మరింత కంగదిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వం, సంబందిత అధికారులు వెంటనే స్పందించి ధాన్యం బకాయిలను రైతు ఖాతాలకు జమ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి సంభందిత కార్యాలయాల వద్ద అధికారులను నిలదీసేందుకు ఏపి కౌలు రైతు సంఘం సమాయత్తమవుతుందని శీలం నారాయణరావు హెచ్చరించారు.

విద్యుత్ తీగలు మార్చాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : పంచాయతీ పరిధిలోని ఆరో వార్డులోని గొడపాలెంలో ఇంటి స్లాబ్ కు అనుకొని ఉన్న విద్యుత్తు తీగలను ప్రమాదం జరగకముందే మార్చాలని ఆ ప్రాంత వాసులు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అధికారులు రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లను అనుకొని ఉన్న విద్యుత్తు లైన్లు తమను భయపెడుతున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే స్పందించి అధికారులు విద్యుత్ తీగలను మార్చి క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

ఇంటికి ఆనుకొని ఉన్న విద్యుత్ తీగలను చూపుతున్న మహిళలు

పన్నులతో ప్రభుత్వం దోపిడీ : టిడిపి

ప్రజాశక్తి-గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గుడివాడ ఎనిమిదో వార్డు పెద్ద వీధిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఇంటింటికి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పన్నుల రూపంలో ప్రభుత్వం చేస్తున్న దోపిడీను ఆయన ప్రజానీకానికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు దింట్యాల రాంబాబు, నాగరాజు, యార్లగడ్డ సుధారాణి, ఎం. సునీత, పోలాసి ఉమా, సర్కార్, రామినేని వేణు, బి. భవాని, రమేష్ చౌదరి మరియు వార్డు టిడిపి నేతలు అర్వేపల్లి పాండు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

'జగనాసూర రక్తచరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : వివేకానందరెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుటుంబ పాత్ర ఉన్నట్లు రోజురోజుకీ అనుమానం బలపడుతుందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో 'జగనాసూర రక్త చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రవీంద్ర మాట్లాడుతూ హత్య జరిగిన రోజున సిబిఐ విచారణ కోరిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సిబిఐ ఎంక్వయిరీ వద్దని ఎందుకు చెప్పావ్ చెప్పాలని ప్రశ్నించారు. .హత్య జరిగిన రాత్రి అవినాష్ రెడ్డి ముఖ్యమంత్రి భార్య భారతి రెడ్డి సహాయకుడికి ఫోన్ చేసి మాట్లాడాడా లేదా చెప్పాలన్నారు. ఉద్దేశ్య పూర్వకంగానే సొంత బాబాయిని హత్య చేయించారని ఆరోపించారు. మాజీ ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి రాజకీయాల్లోకి రాకముందే తండ్రిని అడ్డం పెట్టుకొని ఆర్థిక నేరాలకు పాల్పడ్డాడని జగన్ పై ఉన్న కేసులకు ఎంతకాలం ఎన్ని శిక్షలు పడతాయో ఎవరు చెప్పలేకపోతున్నారన్నారు. ఈ సమావేశంలో గొర్రెపాటి గోపీచంద్, గోపూ సత్యనారాయణ,తలారి సోమశేఖర్, పార్టీ పట్టణ కార్యదర్శి కాంతారావు, పలువురు కార్పొరేటర్లు కార్యకర్తలు ఉన్నారు. **ప్రజాశక్తి-గుడివాడ** : సోమవారం స్థానిక టీడీపీ ఆఫీస్ నందు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు తదితరులతో కలిసి తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన జగనాసుర రక్త చరిత్ర పేరుతో పుస్తకాన్ని, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డాక్టర్ గోర్ల సత్యనారాయణ, పోలాసి ఉమా, షేక్ సర్కార్, నాగరాజు, యార్లగడ్డ సుధారాణి, పి. సాంబశివరావు, గోవాడ శివ, ఎమ్. రమేష్ చౌదరి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ

ఎస్‌పిఎస్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-గుడివాడ : ఈనెల 12వ తేది ఆదివారం రోజున స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన పర్వతనేని జగన్మోహనరావు మెమోరియల్ 10కె, 6కె, 4కె రన్ ల పరుగు పందెంలో గుడివాడ ఎస్.పి.ఎస్. మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 10కె బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, 6కె లో బాలికల విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలను అలాగే 4కె బాలుర విభాగంలో మొదటి, తృతీయ స్థానం సాధించడమే కాకుండా మొత్తం అన్ని విభాగాలలో 45 బహుమతులు సాధించి ఈ పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయిని టి.ఎం.ఇ. రాణి మరియు పాఠశాల సిబ్బంది క్రీడాకారులను మరియు వ్యాయామ ఉపాధ్యాయులు మడకా ప్రసాద్‌ను ఘనంగా అభినందించడం జరిగింది.

అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-గుడివాడ : పట్టణంలో పోస్ట్ ఆఫీస్ రోడ్‌లో గత కొంతకాలంగా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న ఒక వృద్ధురాలు రాత్రి అనారోగ్యంతో చనిపోవడంతో అక్కడ ఉన్న స్థానికులు సమాచారం మేరకు పట్టణ జనసేన నాయకులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాచర్ల రామకష్ణ (ఆర్.కె.), జనసేన నాయకులు అయ్యప్ప, చరణ్, సురేష్, మరియు జనసైనికులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం బలరామునిపేట లోని అది వెలమ సంఘము కార్యాలయం వద్ద ఆర్థికం గా చదువులకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సోమవారం స్కాలర్ సిప్ అందజేశారు. అదివెలమ కుటుంబ పిల్లలకు విశాఖపట్నం నివాసి ఇమ్మనెని లక్ష్మీ నారాయణ , సావిత్రి దంపతులు విద్యనిధి ప్రవేశపెట్టి గత 4 సంవత్సరాలు నుండి మచిలీపట్నం విద్యార్థులకు స్కాలర్షిప్ ఇస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంకు సంబంధించి 7 గురు విద్యార్థులు కు 70 వేల రూపాయల చెక్ లను అది వెలమ సంఘము గౌరవ అధ్యక్షుడు పిల్లారిసెట్టి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ అంకాల సుబ్బారావు, సెక్రెటరీ మరకాని వాసు, ట్రెజరీ పిల్లారిసెట్టి సత్యన్నారాయణ మరియు ఎం.వీరబాబు, రమేష్,సత్యన్నారాయణలు చెక్కులు పంపిణీ చేశారు.

మురుగు నీరు నిల్వలేకుండా చర్యలు

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ పురపాలక సంఘ పరిధిలోని సత్యనారాయణపురంలోని మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఫిర్యాదు అందడంతో సోమవారం మున్సిపల్ కమిషనర్ వి. మురళీకష్ణ సంబంధిత ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బందితో కలిసి 23వ వార్డు సత్యనారాయణపురంలో సందర్శించారు. ఈ విషయమై కమిషనర్ మురుగు నీరు రోడ్లమీద నిలవకుండ, దోమల బెడద లేకుండా మరియు దుర్గంధం రాకుండా ఉండేలాగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. అదేవిధంగా చింతల కాలవ మురుగు కాల్వకు అనుసంధానంగా ఉండే ప్రధాన డ్రైన్ పూడిక తీయుటకు అంచనాలు సిద్ధం చేయవలసిందిగా సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సంబంధిత వార్డు ప్రజలు కూరాళ్ళ హేమాంబరావు, జిల్లా రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్‌టిసి డిఎం

ప్రజాశక్తి-గుడివాడ : ఈనెల 14వ తేది మంగళవారం ఉదయం 11.30 గంటల నుండి 12.30 గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమం జరుగుతుందని గుడివాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడివాడ ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యలను డయల్ యువర్ డిఎం కార్యక్రమం సెల్ నెం 9959225464 కు ఫోన్ చేసి చేయవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, ప్రజానీకం సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిపో మేనేజర్ రాజేష్ విజ్ఞప్తి చేశారు.

పుస్తకాల అధ్యయనంతోనే విజ్ఞానం...

పుస్తక ప్రియుల పాదయాత్రలో పాల్గొన్న చిన్నారులు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: విద్యార్థులు సిలబస్‌లో లేని పుస్తకాలను పఠనం చేయాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన పుస్తక మహోత్సవ్‌లో సోమవారం పుస్తక ప్రియుల పాదయాత్ర అనంతరం సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో మాజీ పార్లమెంట్ సభ్యులు ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలన్నారు. కవులు ఎంతో సామాజిక ధృక్పతంతో పాటు ఎంతో ముందు చూపు ఉన్నవారని అన్నారు. కవులు ఎప్పుడో 1960లో రాసిన పుస్తకంలో 2020 తరువాత ఎలా సమాజం ఉంటుందో రాస్తారని అలాగే ఉంటుందని తాను ఈమధ్య అప్పటి పుస్తకం చదివి తెలుసుకున్నానని గుర్తు చేశారు. అంటే కవులు ఎంతో ముందుచూపుతో ఊహించి రాస్తారని కవులు కాలా గొప్పవారని అన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సబ్జెక్టు పుస్తకాలతో పాటు ఇతర పుస్తకాలు చదవడం వలన విజ్ఞానం వస్తుందన్నారు. చదవ గలిగే శక్తి ఉన్నంతవరకు పుస్తకాలు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. దేశం కోసం, మానవాళి కోసం పుస్తకాలు చదవాల్సిన అవసరం నేడు ఎంతయినా ఉందన్నారు. విజయవాడ పుస్తక మహెూత్సవానికి ఎంతో విశిష్టత ఉందని, ఇక్కడ ప్రతి ఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారని గత ఐదేళ్లుగా తాను పాల్గొంటున్నానని తెలిపారు. విజయవాడతో పాటు ఇతర ప్రాంతాలలో కూడా పుస్తక ప్రదర్శన నిర్వహించడం ద్వారా అందరికీ విజ్ఞానం అందుతుందన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంపి ఉండవల్లి అరుణ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలు చదువుతున్నారు కాని కేవలం సిలబస్ పుస్తకాలు మాత్రమే చదువుతున్నారన్నారు. సిలబస్‌లో లేని పుస్తకాలు ఎంతవరకు చదువుతున్నారని ఆలోచించాలన్నారు. నూటికి 99 శాతం మంది కేవలం సబ్జెక్టు పుస్తకాలు మాత్రమే చదువుతున్నారన్నారు. ఇతర పుస్తకాలు కూడా చదవాలనే అభిరుచి నేటితరం విద్యార్థులకు, ముఖ్యంగా యువతకు కలిగించాలన్నారు. ఆ విధంగా చేయాలంటే ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అలాగే చాలా మంది పరీక్షలు తప్ప సొంతంగా రాయలేని స్థితి ఉందన్నారు. పుస్తకాలు చదవడం వలన పరీక్షలతో పాటు ఇతరత్రా ఏ అంశాన్ని అయినా సులభంగా రాయగలరని అన్నారు. ముఖ్యంగా చిన్ననాటి నుండి పుస్తకాలు చదవడం అలవాటుగా రావాలన్నారు. పుస్తకాలు చదివే వారికి అల్జీమర్స్ తక్కువగా వస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ చదవడంతో పాటు ఇతరులకు కూడా చదివించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కవి, సాహితీవేత్త వాడ్రేవు చినవీరభద్రుడు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు ఎన్. వెంకటేశ్వర్లు, పాల్గొనగా కార్యక్రమానికి ఎమెస్కో విజయకుమార్ అధ్యక్షత వహించగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శిలు వి.మనోహర్‌నాయుడు, కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

రహదారులపై బారికేడ్లు తొలగించాలి

హైకోర్టులో పిల్ వేసిన న్యాయవాది జయశ్రీ

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజలు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న పోలీసు బారికేడ్లు, కూడళ్లలోని ప్రచార బోర్డులను తొలగించాలని విజయవాడ సివిల్ కోర్టులోని న్యాయవాది కొల్లా జయశ్రీ కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక ప్రకటన విడుదలచేస్తూ...నగర ప్రజలు, వాహనదారుల నుంచి వ్యక్తం అవుతున్న అభిప్రాయాలతో పాటు తన పరిశీనలో ఎదురయిన అనుభవాల నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో పలు రహదారుల రద్దీ ప్రాంతాల్లో రోడ్డుకు అడ్డంగా ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నందున, పోలీసుల లక్ష్యం నెరవేరకపోగా నిత్యం ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురికావాల్సి వస్తోందని అన్నారు. బారికేడ్ల వద్ద అదుపు తప్పి అనేక ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని అన్నారు. అంతేగాక ప్రధాన రహదారుల కూడళ్లలో పెద్ద పెద్ద ప్రచార హెూర్డింగ్‌ల వల్ల యుటర్న్ తీసుకునేందుకు వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నగర వ్యాప్తంగా ఆయా రహదారుల మధ్యలో, ఆయా రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీసు బూత్‌లు అనేక ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉండటంతో పాటు రోడ్డు స్థలాన్ని ఆక్రమించి ట్రాఫిక్‌కు తీవ్ర అసౌకర్యం ఏర్పడుతుందన్నారు. ఇటువంటి ఇబ్బందులను పలు సార్లు పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంజరిగిందన్నారు. అయినా స్పందించడం లేదన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని రహదారులపై బారికేడ్లు తొలగించాలని, యూ టర్న్ పాయింట్స్‌లో హెూర్డింగ్‌లు, రోడ్ల మధ్యలో పోలీసు బూత్‌లు తొలగించాలని కోరుతు తాను హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) గత నెల 27న వేయడం జరిగిందని, అది ఈ నెల 2న హైకోర్టు బెంచ్‌మీదకు వచ్చిందని జయశ్రీ తెలిపారు. తక్షణమే రహదారులపై ఆటంకాలు, అడ్డంకులు ఎదరవ్వకుండా, రాకపోకలు సాఫీగా సాగే విధంగా జిల్లా కలెక్టర్, పోలీసు కమిషనర్ చర్యలు తీసుకోవాలని జయశ్రీ కోరారు.

గిరిజనుల బలోపేతానికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా గిరిజనులు అభివృద్ధి చెందాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు అన్నారు. నగరంలోని కలెక్టరేట్ పింగళివెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం జి.కొండూరు మండలం కవులూరు గ్రామనికి చెందిన 18 మంది యానాది గిరిజన లబ్దిదారులకు,జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డిఆర్‌వో కె. మోహన్‌కుమార్‌లు కృష్ణానదిలో చేపల వేటకు అనుమతి పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా యానాది గిరిజన లబ్దిదారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా వుండాలని, పిల్లలను బాగా చదివించుకుని వృద్ధిలోకి రావాలన్నారు. చేపల వేట ద్వారా మత్స్య సంపదను విక్రయించుకుని ఆర్థికంగా వృద్ధిలోకి రావాలన్నారు. త్వరలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా చేపలు పట్టే వలలు, బోట్లు, ఇతర ఉపయోగపడే పరికరాలు అందించేలా ప్రతి పాదనలు రూపొందించాలని మత్స్య శాఖ అధికారులను ఆదేశించామన్నారు. జిల్లాలో సుమారు 10 వేల మంది యానాది కులాలకు చెందిన గిరిజనులు ఉన్నారని, వీరిని గుర్తించి వివరాలు సేకరించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే నక్కల, పూసల కుటుంబాలకు కులధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు ఆధార్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అందిస్తున్న అన్ని పథకాలను చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ జిల్లా అధికారి యం రుక్మాంగదయ్య, మత్స్య శాఖ డిప్యూటి డైరెక్టర్ ఏ నాగరాజా, తదితరులు ఉన్నారు.

కలెక్టర్ ఇచ్చిన అనుమతి పత్రాలను చూపిస్తున్న యానాది గిరిజనులు

బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-విజయవాడ: బ్యాంకుల ద్వారా అందిస్తున్న ఆర్థిక పరమైన లావాదేవీల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి వుండాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా వారం రోజుల పాటు నిర్వహించే (ఫైనాన్స్ లిటరసీ) ఆర్థిక పరమైన అవగాహన కార్యక్రమాలలో భాగంగా ముద్రించిన అవగాహన పోస్టర్లను సోమవారం పింగళివెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో నేటి నుండి 17వ తేది వరకు వారం రోజుల పాటు అన్ని బ్యాంకులలోను, బ్యాంకింగ్ కరస్పాండెంట్ల తోడ్పాటుతో ప్రజలకు బ్యాంకింగ్ కార్యకలాపాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ముఖ్యంగా కొత్తగా బ్యాంకు ఖాతాలను తెరవడం, బ్యాంకు ఖాతాల వల్ల ఖాతాదారులకు అందే సౌకర్యాలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన, మోసపూరితమైన యాప్‌లు, అన్‌లైన్ బ్యాంకింగ్ కార్యకలాపాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన వుంటుందన్నారు. ప్రైవేట్ బ్యాంకుల వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వ గుర్తించిన బ్యాంకుల ద్వారా దస్తావేజులు అవసరం లేని విధంగా ఋణాలను పొందేందుకు సులభతర డిజిటల్ విధానంపై అవగాహన కల్పిస్తారన్నారు.

శ్రీశైలంకు 33 సర్వీసులు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రయాణం టికెట్లతో పాటు శ్రీ శైలం భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి దర్శనం టికెట్ కూడా ముందస్తుగానే బుకింగ్ చేసుకునే అవకాశాన్ని ఎపిఎస్ఆర్‌టిసి కల్పిస్తున్నట్లు, ఈ సదవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి ఎం ఏసుదానం తెలిపారు. ఈమేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...ప్రయాణికుల సదుపాయం కోసం విజయవాడ నుంచి శ్రీశైలంకు నిత్యం 32 సర్వీసులు, అలాగే జగ్గయ్యపేట నుంచి ఒక సర్వీసును అందుబాటులో ఉంచినట్లు ఆర్‌ఎం తెలిపారు. టికెట్లు కావాల్సిన వారు ఆన్‌లైన్ ద్వారా (ఎపిఎస్ఆర్‌టిసిఆన్‌లైన్.ఇన్) లేదా, తమ సమీప బస్‌స్టేషన్‌లో కానీ, ఆర్‌టిసి ఆధీకృత టికెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద కానీ పొందవచ్చునన్నారు. సర్వదర్శనం టికెట్ ధర రూ. 500, అతి శీఘ్ర దర్శనం రూ.300, శీఘ్ర దర్శనం కోసం రూ.150 ధర ఉన్నట్లు తెలిపారు. ఉదయం 7.30, మధ్యాహ్నం 12.30, రాత్రి 9 గంటలు టైమ్ స్లాట్ అని ఆర్‌ఎం వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని ఆర్‌ఎం దానం తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక,
పదవీ విరమణ, జయంతి, వర్ధంతి,
శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు
అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ
సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల
సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.